ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 90 | సోమవారం 29 డిసెంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



# 2025 విజయాలు

- అన్ని రంగాల్లోనూ బలమైన ముద్ర...
- జాతీయ భద్రత, క్రీడలు, వైజ్ఞానిక రంగంలోనూ విజయాలు..
- ఆపరేషన్ సింధూర్‌తో రాజీలేని భద్రత..
- ప్రయాగ్‌రాజ్‌లో కుంభ మేళా ఒక అద్భుతం..
- వందేమాతర గీతానికి 150ఏళ్లు పూర్తి...
- మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ...

**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 28 :**

2025సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగుస్తోంది. ఈనేపథ్యంలో ఈ సంవత్సరమంతా దేశం సాగించిన ప్రయాణం, సాధించిన విజయాలు ప్రతీ ఒక్కరూ ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉండగా, ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈ ఏడాది సాధించిన విజయాలను గుర్తు చేశారు. అన్ని రంగాలలోనూ ఈ ఏడాది అన్ని రంగాల్లో భారత్ తనదైన బలమైన ముద్ర వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతీయ భద్రత నుంచి క్రీడల వరకు, వైజ్ఞానిక రంగంనుంచి ప్రపంచ వేదికల వరకు అన్ని రంగాల్లో దేశం విజయాలను చవి చూసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ తన భద్రతా విషయంలో రాజీ పడదని ప్రపంచం స్పష్టంగా చూసిందని ప్రధానమంత్రి అన్నారు. ప్రయాగ్ రాజ్ కుంభమేళా, అయోధ్య రామాలయ ధ్వజారోహణపై మోదీ 2025 ప్రారంభంలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా ఒక అద్భుతం అని ప్రధాని మోదీ తెలిపారు. అక్కడికి తరలివచ్చిన కోట్లాదిమంది భక్తులను చూసి భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాల విషయంలో ప్రపంచం ఆశ్చర్యపోయిందన్నారు. అలాగే సంవత్సరం చివరలో అయోధ్య రామాలయంలో జరిగిన 'ధ్వజారోహణ' కార్యక్రమం కూడా ప్రతి భారతీయుడిలో గర్వాన్ని నింపిందని మోదీ గుర్తు చేశారు. 'వందేమాతరం' గీతం 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలు చూపించిన ఉత్సాహం అద్భుతమన్నారు. (మిగతా 2లో)

## చారిత్రాత్మక మార్పులు

# కాంగ్రెస్ పాలనలోనే

### ఘనంగా కాంగ్రెస్ 140వ ఆవిర్భావ దినోత్సవం



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 28 :**

దేశంలో చారిత్రాత్మక మార్పులు ప్రారంభమైంది ఒక కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అని కాంగ్రెస్ పెద్దలు పేర్కొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఘనంగా జరుపుకుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ తర్వాత పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఖర్గే.. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో దేశంలో అనేక చరిత్రాత్మక మార్పులు వచ్చాయని, గ్రీన్ రివల్యూషన్, వైట్ రివల్యూషన్ వంటి కార్యక్రమాలతో దేశాన్ని మార్చామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పని అయిపోయిందని విమర్శిస్తున్నారు. మా శక్తి తగ్గింది కావచ్చు.. కానీ పోరాటం ఆగలేదు' అంటూ ఖర్గే స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ హయాంలో స్థాపించిన సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, (మిగతా 2లో)

## సినీ ప్రస్థానానికి

# శాశ్వతంగా స్వస్తి

### టివికె అధినేత విజయ్ కీలక నిర్ణయం



**చెన్నై, డిసెంబర్ 23 :**

తమిళ నటుడు, టీవీకే అధినేత దళపతి విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. విజయ్ కథానాయకుడిగా నటించిన జననాయగన్ సినిమా ఆడియో విడుదల వేడుక మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు..తమిళ నటుడు, టీవీకే అధినేత దళపతి విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన సినీ ప్రస్థానానికి పూర్తిగా స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించారు. జన నాయగన్ అనే సినిమానే తన ఆఖరి చిత్రమని అధికారికంగా ప్రకటించారు. విజయ్ (మిగతా 2లో)

## చంద్రబాబుది రాజకీయ

# అవకాశ వాదమే

- చంద్రబాబు పాలనలో దాడులు, దౌర్జన్యాలు..
- హామీల అమలులో తప్పించుకునే యత్నం..
- పొట్టేళ్లు, కోళ్లు ఎలా తినాలో ప్రభుత్వమే చెప్పాలా..
- జంతుబలి చట్టాలను కూటమి నేతలు తెలుసుకోవాలి..
- బాలకృష్ణ ఫ్లెక్సీల ముందు జంతు బలులు కనిపించలేదా..
- చంద్రబాబు ఫ్లెక్సీల ముందు జరగలేదా...
- మాజీ మంత్రి శైలజానాథ్...



**అనంతపురము, డిసెంబర్ 28 :**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజన్ లేదు.. కేవలం రాజకీయ అవకాశవాదమే ఉంది అంటూ తీవ్ర విమర్శలు చేశారు మాజీ మంత్రి సాకే శైలజానాథ్. చంద్రబాబు పాలనలో దాడులు, దౌర్జన్యాలు తప్పా ఏమీ లేవు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి శైలజానాథ్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..' తప్పించుకున్నవాడు ధన్యుడు అన్నట్లు చంద్రబాబు హామీల అమలు నుంచి తప్పించుకుంటున్నారు. వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరగడాన్ని టీడీపీ కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. వైఎస్ జగన్ అభిమానులు మాంసం తినటమూ తప్పేనా?. పొట్టేళ్లు, కోళ్లు ఎలా తినాలో ప్రభుత్వం చెప్పాలా?. జంతు బలి చట్టాలను టీడీపీ కూటమి నేతలు తెలుసుకోవాలి. చంద్రబాబు పాలనలో దాడులు, దౌర్జన్యాలు తప్పా ఏమీ లేవు. వైఎస్ జగన్కు రోజు రోజుకూ ప్రజాదరణ (మిగతా 2లో)

# ఒకరోజు ముందే పెన్షన్లు

- జనవరి 1కి బదులుగా డిసెంబర్ 31నే పెన్షన్లు..
- పంపిణీకి సిద్ధమవుతున్న సచివాలయ ఉద్యోగులు.
- పెన్షన్లకోసం 18 నెలల్లోనే రూ 50వేల కోట్లు ఖర్చు
- పెన్షన్ల పై వైసీపీ విష ప్రచారం...



**అమరావతి, డిసెంబర్ 28 :**

ఏపీలో జనవరి నెల పెన్షన్లను ఒకరోజు ముందుగా ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలంటూ సచివాలయ ఉద్యోగులు తాజాగా కోరడంతో ఆ మేరకు ప్రభుత్వం అంగీకరించింది. జనవరి 1కు బదులుగా డిసెంబర్ 31నే పెన్షన్లు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో మరో మూడు రోజుల్లో పెన్షన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి వైసీపీ ఓ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 5 లక్షల దివ్యాంగుల పెన్షన్లను తొలగించిందంటూ వైసీపీ ప్రచారం చేస్తోంది. తాజాగా చేపట్టిన సర్వేల ద్వారా ఇలా భారీగా పెన్షన్లను తొలగిస్తున్నట్లు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇవాళ పెన్షన్ల తొలగింపుపై స్పందించింది. ఈ మేరకు దివ్యాంగుల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి క్లారిటీ ఇచ్చారు. దివ్యాంగుల పింఛన్లపై బ్లూ మీడియా దిగజారుడు రాతలు సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం 5 లక్షల పింఛన్లు తొలగించిందని జగన్ అండ్ కో విష ప్రచారం చేస్తున్నారని మంత్రి స్వామి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అర్హులైన ఏ ఒక్కరి పింఛను తొలగించలేదని (మిగతా 2లో)

## అరకువ్యాలీలో

# పర్యాటకుల రద్దీ



**అరకు, డిసెంబర్ 23 :**

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కుగ్రామం, పర్యాటక ప్రదేశమే అరకు వ్యాలీ. ఇది విశాఖకు సుమారు 114 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ సముద్ర మట్టం నుంచి 900 మీటర్ల ఎత్తులో ఉండి అణువణువూ ప్రకృతి రమణీయతతో విలసిల్లుతున్న తూర్పు కనుమలలోని అద్భుత పర్వత శ్రేణి ఉంది. విశాఖ నుంచి అరకు చుట్టివచ్చే ప్రయాణం ఓ అందమైన అనుభూతినిస్తుంది. అయితే.. వరుస సెలవులతో (మిగతా 2లో)

## వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన

# మూడు అమూర్ ఫాల్కన్‌లు



- 5 రోజుల్లో 5వేల కిలోమీటర్లు ప్రయాణించి రికార్డు...
- అపాపాంగ్ అనే పక్షి 6రోజుల్లో 6100కిలో మీటర్ల ప్రయాణం..

**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 28 :**

మణిపూర్ నుండి ఆఫ్రికాకు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించాయి మూడు అమూర్ ఫాల్కన్లు. మణిపూర్ లో శాటిలైట్ ట్యాగ్‌లు అమర్చిన మూడు అమూర్ ఫాల్కన్‌లు అపాపాంగ్, అలాంగ్, అహు.. భారత్ నుండి దక్షిణాఫ్రికాలోని తమ శీతాకాల నివాసాలకు చేరుకొని రికార్డు సృష్టించాయి. ఈ సుదూర యాత్ర ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 5 రోజుల్లో 5వేల కిలోమీటర్లు ఈ పక్షులు ప్రయాణించాయి. అపాపాంగ్ అనే అమూర్ ఫాల్కన్ నవంబర్ నెలలో కేవలం 6 రోజుల్లో 6,100 కిలోమీటర్ల ప్రయాణాన్ని పూర్తి చేసింది. అరేబియా సముద్రం దాటుకుంటూ నేరుగా కెన్యా చేరుకున్న ఈ పక్షి.. డిసెంబర్ చివరి నాటికి (మిగతా 2లో)

# ఫ్యూచర్ స్కిల్స్ హబ్ ప్రారంభం

- డిజిటల్ పరివర్తన, ఉపాధి సృష్టి దిశగా అడుగులు..
- ఏఐ ఆధారిత గ్రామీణ నైపుణ్య, జీవనోపాధికై శిక్షణ..
- ప్రతి ట్రాక్‌కు 12 వారాల శిక్షణ..
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్..



**రాజమండ్రి, డిసెంబర్ 28 :**

పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో గ్రామీణ ఉపాధిని ప్రోత్సహిస్తూ, యువత, మహిళలకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'సైయెంట్ ఏఐ అండ్ ఫ్యూచర్ స్కిల్స్ హబ్'ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామీణాభివృద్ధి, డిజిటల్ పరివర్తన, ఉపాధి సృష్టి దిశగా ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. సైయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఒక మోడల్ ఏఐ ఆధారిత గ్రామీణ నైపుణ్య, జీవనోపాధి కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత, మహిళలు, రైతులు, స్వయం సహాయక బృందాలు, స్థానిక ప్రజలకు భవిష్యత్తుకు సిద్ధమైన నైపుణ్యాలను అందించడం ద్వారా వారిని ఆర్థికంగా, సామాజికంగా సాధికారత చేయడమే ఈ కేంద్రం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు నిర్మలా సీతారామన్. ఈ చొరవ డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, వికసిత్ భారత్ - 2047 (మిగతా 2లో)

# 2025 విజయాలు

(మొదటి పేజి (తరువాయి)

వికసిత్ భారత్ యంగ్లీడర్స్ డైలాగ్ అండ్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ అండ్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 లో యువత భాగస్వామ్యం పెరగడం సంతోషంగా ఉందన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. ఈ అంశంపై క్విజ్ పోటీల్లో ఈ ఏడాది 50 లక్షలకు పైగా యువతీ యువకులు పాల్గొన్నారని చెప్పారు. యంగ్ లీడర్స్ డైలాగ్ రెండో కార్యక్రమం వచ్చేనెల 12వ తేదీ స్వామి వివేకానంద జయంతి రోజున జరుగుతుందన్నారు.

యాంటీ బయాటిక్స్ వినియోగంపై ప్రధాని మోదీ యువత ఆలోచనలను కార్యాచరణగా మార్చే మరో మాధ్యమం 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' అంటూ, ఇంత వరకు 13 లక్షలకు పైగా విద్యార్థులు 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'లో పాల్గొన్నారని, ఆరు వేల కంటే ఎక్కువ సంస్థలు ఈ హ్యాకథాన్ లో పాలుపంచుకున్నాయన్నారు. యాంటీ బయాటిక్స్ మందులను ప్రజలు ఇష్టం వచ్చినట్లు ఉపయోగించ వద్దన్నారు..ఐ.సి.ఎం.ఆర్. తాజా నివేదికలో న్యుమోనియా, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధులకు వీటివల్ల పెద్దగా ఉపయోగం లేదని చెప్పిందన్నారు. ఏపీలో లేస్ క్రాఫ్ట్ పై ప్రధాని మోదీ మన సంప్రదాయ కళలు సమాజాన్ని శక్తిమంతం చేయడమే కాకుండా ప్రజల ఆర్థిక పురోగతికి మాధ్యమంగా మారుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం ప్రాంతానికి చెందిన లేస్ క్రాఫ్ట్ కు లభిస్తున్న ఆదరణను ప్రస్తావించారు. ఈ కళ కొత్త రూపురేఖలతో విస్తరించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డ్ కృషి చేస్తున్నాయన్నారు. దీనివల్ల , 250 కంటే ఎక్కువ గ్రామాల్లో సుమారు లక్ష మంది మహిళలు 500కు పైగా ఉత్పత్తులతో ఉపాధి పొందుతున్నారని ప్రధానమంత్రి చెప్పారు.పి.ఎం. సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన గురించి చెప్పిన మోదీ మణిపూర్‌కు చెందిన మోయిరంగ్ థెమ్ సేథ్ సౌరశక్తి ప్రచారం తో వందలాది ఇళ్లలో కరెంటు వచ్చిందన్నారు. అలాగే, మణిపూర్ లోని అనేక ఆరోగ్య కేంద్రాలు సౌరశక్తిని పొందుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 'పి.ఎం. సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన' కింద కేంద్ర ప్రభుత్వం 75 వేల నుంచి 80 వేల రూపాయలు అందిస్తోందని నరేంద్రమోదీ గుర్తు చేశారు.

# ఫ్యూచర్ స్కిల్స్ హబ్ ప్రారంభం



(మొదటి పేజి (తరువాయి)

వంటి జాతీయ కార్యక్రమాలకు అనుసంధానంగా పనిచేస్తోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాలు కూడా దేశ ఏఐ ఆధారిత అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు అవ్వాలనే దృక్పథంతో ఈ హబ్‌ను రూపొందించారని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ మౌలిక సదుపాయాలను కార్పొరేట్ సామాజిక బాధ్యత భాగస్వామ్యాల ద్వారా ఎలా సమర్థవంతంగా వినియోగించవచ్చో ఈ కేంద్రం ఒక ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు నిర్మలా సీతారామన్.ఈ కేంద్రం ద్వారా అందించే శిక్షణా కార్యక్రమాలు నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా, పరిశ్రమ అవసరాలకు సరిపోయేలా రూపొందించినట్లు తెలిపారు. ముఖ్యంగా మూడు ప్రధాన భవిష్యత్తు నైపుణ్య మార్గాలపై శిక్షణ అందించనున్నారని వెల్లడించారు. వీటిలో ఏఐ ఎనేబుల్డ్ డిజిటల్, ఐటీ లిటరసీ, ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెటింగ్, ఈ - కామర్స్, అగ్రిటెక్, ఆక్వాటెక్ (డ్రోన్ ఆపరేషన్స్) ఉంటాయని వివరించారు. ప్రతి ట్రాక్‌కు 12 వారాల శిక్షణా కాలపరిమితి ఉంటుందని.. ఇందులో 60 శాతం ఆచరణాత్మక శిక్షణ, 40 శాతం ఏఐ సహాయక బోధన ఉంటుందని చెప్పుకొచ్చారు. శిక్షణ పూర్తయిన తర్వాత శిక్షణార్థులకు సర్టిఫికేషన్ అందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాలు, ప్లేస్‌మెంట్, స్వయం ఉపాధి మార్గాలపై మార్గనిర్దేశం చేస్తారని చెప్పుకొచ్చారు. దీనివల్ల గ్రామీణ యువత నగరాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఏర్పడుతుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళల సాధికారత, యువత ఉపాధి, వ్యవసాయం సాంకేతికత అనుసంధానం, గ్రామీణ ఆర్థిక వృద్ధి వంటి అనేక లక్ష్యాలు ఒకేసారి సాధిస్తాయని అభిప్రాయపడ్డారు. డ్రోన్ టెక్నాలజీ, అగ్రి టెక్, ఆక్వాటెక్ శిక్షణల ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన పెరుగుతుందని, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడుతుందని సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, పలువురు శాసనసభ్యులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా నాయకులు, అధికారులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయ అవకాశవాదమే

(మొదటి పేజి (తరువాయి)

పెరుగుతోంది.

వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా ఒకటి, రెండు చోట్ల ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఫ్లెక్సీల వద్ద పొట్టేళ్లు కొడితే, అది పెద్ద నేరం అన్నట్లు.. రాష్ట్రంలో గతంలో ఎక్కడా అలా జంతు బలి జరగనట్లు మీరు (సీఎం చంద్రబాబు), మీ హోం మంత్రి మాట్లాడుతున్నారు. దాని వల్ల సమాజం నాశనమై పోతున్నట్లు నిందిస్తున్నారు. యువతను ప్రభావితం చేస్తున్నట్లు పిచ్చి ఆరోపణలు చేస్తున్నారు. అలా చేసి హింసను ప్రేరేపిస్తున్నారు కాబట్టి, రాష్ట్ర బహిష్కరణ చేస్తామని అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు. మరి జాతరలు, గ్రామోత్సవాల్లో కూడా జంతు బలులు సహజం. వాటిని కూడా తప్పు పడుతున్నారా? మొక్కుల కోసం జంతు బలి ఇచ్చిన వారిపైనా చర్యల తీసుకుంటారా? లేదా రాష్ట్రంలో జంతు బలులనే నిషేధిస్తారా?.వైఎస్ జగన్ ఫ్లెక్సీల వద్ద పొట్టేళ్ల బలిని అంతగా తప్పు పడుతున్న మీకు.. హిందూపురంలో మీ బావమరిది నందమూరి బాలకృష్ణ గెలుపు తర్వాత పదుల సంఖ్యలో పొట్టేళ్లు నరికి, వాటి తలకాయలతో ఆయన ఫ్లెక్సీకి దండ వేశారు. అది కనిపించడం లేదా బాబు?. ఇంకా 2023లో మీ (చంద్రబాబు) పుట్టినరోజు సందర్భంగా మీ పార్టీ కార్యకర్తలు పొట్టేళ్లు నరికి, రక్తంతో మీ ఫ్లెక్సీకి రక్త తర్పణం చేశారు. అంతెందుకు గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున, అనేకచోట్ల మీ ఫ్లెక్సీలు పెట్టి, బహిరంగంగా పొట్టేళ్లు నరికి, ఆ రక్తాన్ని మీ ఫ్లెక్సీలకు తర్పణం చేశారు. అవన్నీ నిజం కాదా? మరి వాటికేం సమాధానం చెబుతారు?. కదిరి దగ్గర జనసేన కార్యకర్త ఇంట్లో చిన్న గలాటా జరిగితే, దాన్ని కూడా వైఎస్సార్సీపీకి అంటగట్టి బురదచల్లే ప్రయత్నం చేశారు. చివరకు ఆ యువకుడి సోదరి, పూర్తి వివరాలు స్వయంగా చెప్పింది.మెడికల్ కాలేజీలు, శాంతిభద్రతల వైఫల్యం కప్పిపుచ్చేందుకే..

రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే.. శాంతిభద్రతలు ఛిద్రమవుతుంటే.. గంజాయి బ్యాచ్లు పెరుగుతూ పదులు, వందల కేజీల్లో గంజాయి దొరుకుంటే.. మీ నేతలు తప్పుడు పత్రాలతో దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకుంటుంటే.. సగటు మనుషులు బిక్కుబిక్కుమంటూ పోలీసు స్టేషన్లకు వెళ్తుంటే.. ఎమ్మెల్యేలు చెప్పాలని వారు తిప్పి పంపిస్తుంటే ఇవన్నీ మీకు కనిపించడం లేదా? కేంద్ర హోంమంత్రి అమిత్ షా శాంతిభద్రతలపై మీకు లేఖ రాయలేదా? శాంతిభద్రతలే కాదు, ఏమీ లేదు ఇక్కడ.

రాష్ట్రంలో పారిశ్రామికీకరణ లేదు. ఉద్యోగాలు లేవు. పెట్టుబడులు లేవు. ఆలయాలకు రక్షణ లేదు. అన్ని చోట్లా మీ పార్టీ దుర్మార్గమైన ఆలోచనలతో ప్రజల జీవితాల్ని అతలాకుతలం చేస్తున్నారు. ఇవన్నీ కప్పి పుచ్చేందుకు ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఇంకా, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిర్ణయిస్తే, మీరు చేస్తున్న అవినీతి, అక్రమ వ్యవహారం అర్థమై, ఎవరూ బిడ్ వేయలేదు. అందుకే ఒక్కటంటే ఒక్కటీ సరైన బిడ్ రాలేదు. జగన్మోహన్రెడ్డిపై నమ్మకంతోనే మెడికల్ కాలేజీల బిడ్లు వేయడానికి ఎవరూ రాలేదు. వీటన్నింటి నుంచి డైవర్షన్ కోసం, ఇప్పుడు ఫ్లెక్సీలు, రక్త తర్పణాలు అంటూ అనవసర రచ్చ చేస్తున్నారు.

పోలీసులూ అది గుర్తు చేసుకోండి..

పోలీసు అధికారులకు కూడా చెబుతున్నాం. మీరు ఈ ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకోవడం తగదు. టీడీపీ ప్రభుత్వంపై ప్రమాణం చేసి మీరు ఉద్యోగాల్లోకి రాలేదు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఉద్యోగాల్లోకి వచ్చారు. అనంతపురంలో రోడ్డు వేస్తుంటే టీడీపీ దిమ్మె కూలగొట్టారు. ఇక్కడ కాంట్రాక్టర్ మీ వాడు. అధికారులు మీ చెప్పుచేతల్లో ఉన్న వాళ్లు. జేసీబీ డ్రైవర్ కూడా మీవాడే. కానీ జనం మీద బలం చూపిస్తామంటే కుదరదు. పోలీసు శాఖ ఉన్నది న్యాయాన్ని రక్షించడం కోసం. ప్రజలకు రక్షణ కల్పించడం కోసం. అంతేకానీ, అధికార పార్టీ వారు చెప్పిందే చేయడం కోసం కాదు అని స్పష్టం చేశారు.

# మూడు అమూర్ ఫాల్కన్‌లు

(మొదటి పేజి (తరువాయి)

జింబాబ్వే రాజధాని హరారే మీదుగా ఎగురుతూ కనిపించింది. తాజాగా ఐఏఎస్ అధికారి సుప్రియా సాహు 'ఎక్స్'లో ఈ వివరాలను పంచుకున్నారు. నారింజ గుర్తు గల అపాపాంగ్ నవంబర్ లో ఆరు రోజుల్లో నిరాటంకంగా 6,100 కిలోమీటర్లు ప్రయాణించిందన్నారు. భారత్, అరేబియా సముద్రం, హార్న్ ఆఫ్ ఆఫ్రికా మీదుగా కెన్యాకు చేరిన ఈ పక్షి.. చిన్న రాప్టార్ జాతిలో సుదూర నిరంతరాయ ప్రయాణ రికార్డుల్లో ఒకటిగా నిలిచింది.

పసుపు గుర్తు గల అలంగ్ 5,600 కిలోమీటర్లు పయనించి, తెలంగాణ, మహారాష్ట్రలలో ఆగి గత నెలలో కెన్యాకు చేరింది. ఇక ఎరుపు గుర్తుగల ఆహు బంగ్లాదేశ్ దాటి, అరేబియా సముద్రం మీదుగా 5,100 కిలోమీటర్లు ప్రయాణించి సోమాలియాకు చేరుకుంది. ఈ అద్భుత ప్రయాణాలు వాటి ప్రతిభ, సాహసానికి మారు పేరని మరోసారి రుజువైందని అధికారులు చెబుతున్నారు. వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త సురేష్ కుమార్ పర్యవేక్షణలో ఈ పక్షులకు శాటిలైట్ ట్యాగ్‌లు అమర్చారు. వీటి ద్వారా పక్షుల వలస మార్గాలను, వాటి ఓర్పును శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు.ఈ ప్రయాణాలు ప్రపంచ పర్యావరణ వ్యవస్థల అంతర్భాగ సంబంధాన్ని, వలస మార్గాల సంరక్షణ ఆవశ్యకతను నొక్కి చెబుతున్నాయి. బోట్స్‌వానాలోని ఒకావాంగో డెల్టా, సోమాలియాలోని క్వాఫూన్ లకు అవి చేరడం, పక్షుల ఓర్పుపై, ప్రపంచ సంరక్షణ



ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతోంది.

ఈ వార్షిక వలసలు పక్షి ప్రేమికులను, సంరక్షకులను ప్రేరేపిస్తూ, మార్గాలను రక్షించే ప్రయత్నాలను ప్రోత్సహిస్తాయి. వలస జాతులను కాపాడేందుకు సరిహద్దులు లేని విధానాలు, దేశాల మధ్య సహకారం అత్యవసరమని ఈ పక్షుల పయనం స్పష్టం చేస్తుంది.

# దేవుళ్లు, ఆలయాలు రాజకీయాలకోసమా..!

## మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు...

తాడేపల్లి, డిసెంబర్ 28 :

రాష్ట్రంలో ఆలయాలు, దేవుళ్లను రాజకీయాల కోసం వాడుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు చీదరించుకంటున్నారని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీటీడీలో అనేక అపచారాలు జరుగుతున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని మండిపడ్డారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరుగుతున్నా, రీల్స్ చేస్తున్నా, మద్యం, మాంసాహారం యథేచ్ఛగా కొండమీదకు తీసుకొస్తున్నా టీటీడీ బోర్డు ఏం చేస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని, కూటమి పాలనలో టీటీడీ వ్యవస్థ పూర్తిగా నీరుగారి పోయిందని అన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలోని ఆలయాల నిర్వహణలో నిలువెత్తు నిర్లక్ష్యం చోటు చేసుకుందని.. భక్తులు దైవ దర్శనానికి వెళ్తే ప్రాణాలతో తిరిగొస్తామన్న నమ్మకం లేకుండా పోయిందని గుర్తు చేశారు.చంద్రబాబు హయాంలో ప్రతిసారి హిందుత్వం మీద దాడి జరగడం పరిపాటిగా మారిందని.. తిరుపతి, అన్నవరం,కాశీబుగ్గ క్షేత్రమేదైనా కూటమి పాలనలో వరుస అపచారాలు చోటుచేసుకుంటున్నా.. భక్తుల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మల్లాది విష్ణు ఆక్షేపించారు. మరోవైపు రాష్ట్రంలో యధేచ్చగా గోవధ జరుగుతున్నా.. విశాఖ కేంద్రంగా భారీగా గోమాంసం నిల్వలు పట్టుబట్టినా కూటమి నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మల్లాది విష్ణు నిలదీశారు. తిరుమలలో అధికారులు, విజిలెన్స్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయింది. టీటీడీ పాలక మండలిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ సభ్యుడు ఏకంగా మహాద్వారం గుండా వెళ్లాలని అక్కడున్న సిబ్బందితో గొడవపడి నానా రాద్ధాంతం చేశారు. మరోవైపు టీటీడీకి చెందిన గోశాల నిర్వహణ దారుణంగా మారింది. అక్కడ తొలిసారిగా దాదాపు 190 గోవులు మరణించడం అత్యంత బాధాకరం.అదే విషయాన్ని వైయస్సార్సీపీ నాయకులు ఎత్తి చూపితే.. వారి మీద తప్పుడు కేసులు బనాయించే ప్రయత్నం చేశారు. కానీ అదే టీటీడీ పాలకమండలి సమావేశంలో గోశాల నిర్వహణ కష్టంగా ఉందని చర్చించడం ద్వారా మేం చెప్పిన అంశం నిజమేనని రుజువైంది. మునుపెన్నడూ లేని విధంగా చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం టీటీడీని రాజకీయ విమర్శలకు వేదికగా దుర్వినియోగం చేస్తోంది.ఈ ఏడాది ఏప్రిల్ 12న వసంతోత్సవంలో భాగంగా అర్చక స్వాములు స్వామివారికి నైవేద్యం తీసుకెళ్తున్న సమయంలో స్వామివారి గేటు తాళాలు మూసివేయడంతో స్వామివారి నైవేద్య సమర్పణ 15 నిమిషాలు ఆలస్యమైంది. ఇది ఘోరమైన అపచారం. పాలకమండలి పాలనా, నిర్వహణ వైఫల్యానికి, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. అసలు తిరుమలలో వ్యవస్థ పని చేస్తుందా? లేదా? అన్న సందేహం కలిగేలా వ్యవహరిస్తూ కొంతమంది చెప్పులు వేసుకుంటూ వైకుంఠం క్యూ కాంప్లెక్ లోకి వెళ్తున్న ఘోర తప్పిదాలు జరుగుతున్నాయి. అయినా ప్రభుత్వం హిందూధర్మ పరిరక్షణకు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం.కూటమి ప్రభుత్వం తరహాలో వైయస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ఏరోజూ ఇలా జరగలేదు. కానీ 18 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం నిత్యం దేవుళ్లని, హిందూ ధర్మాన్ని అడ్డుపెట్టుకుని దేవుడితో రాజకీయాలు చేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలు కొట్టిచ్చినట్లు కనిపిస్తున్నాయి. సాక్షాత్తూ సుప్రీంకోర్టు స్వయంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాజకీయ వేదిక చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి అక్షింతలు వేసినా.. చంద్రబాబు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదు. టీటీడీకి సంబంధించిన వ్యవహారాలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం.. లడ్డూ తయారీ నెయ్యిలో లేని కల్తీ జరిగిందని సిట్ దర్యాప్తు వేసి.. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దాన్ని వాడుకుంటోంది.అదే విధంగా కాశీనాయన క్షేత్రంలో గోశాల, అన్నదాన సత్రం, భక్తుల విశ్రాంతి భవనాలను టైగర్ రిజర్వ్ జోన్ లో ఉందని.. అత్యంత అమానుషంగా బుల్ డోజర్లతో కూలగొట్టారు. కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారు. వైయస్. జగన్ హయాంలో అయితే ఇదే కాశీనాయన క్షేత్రానికి సంబంధించి అటవీ భూముల నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర అటవీ శాఖ మంత్రికి లేఖ రాశారు. కూటమి ప్రభుత్వానికి, వైయస్.జగన్ ప్రభుత్వానికి ఇదే తేడా.వైయస్. జగన్ హయాంలోనే పరకామణి కోసం అత్యాధునిక వసతులతో కొత్త భవనాన్ని నిర్మించారు. కాబట్టే పరకామణి చోరీ వ్యవహారం బయటపడింది. అయితే ఈ కేసులో మాజీ ఏవీఎస్ సతీష్ వేధింపులకు ఎవరు కారణం?, ప్రభుత్వ వేధింపులు కాదా? ఆంధ్రప్రదేశ్ లో ఉన్న దేవాలయాల నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా తయారైంది. కేవలం టీటీడీ, కాశీనాయన క్షేత్రాల్లోనే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లోనూ ఇవే అపచారాలు జరుగుతూనే ఉన్నాయి. 01-05-2025న సింహాచలం దేవస్థానంలో గోడకూలి 7 మంది సజీవసమాధి అయితే దానికి ఎవరు బాధ్యత వహించారు? ఎవరి మీద చర్య తీసుకున్నారు? పర్వదినాన దర్శనానికి వచ్చిన భక్తులు ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పేతే ఎవరు జవాబుదారీతనంరాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో అసాంఘిక కార్యకలాపాలకు విపరీతంగా పెరిగిపోతున్నా.. పట్టించుకునే నాధుడు లేకుండా పోతుంది. కోడిగుడ్లు తినడం, మద్యపానం, పేకాట వంటివి అష్టాదశ శక్తిపీఠ శ్రీశైలంలో విపరీతంగా పెరిగిపోయాయి. పైగా కూటమి ఎమ్మెల్యే తప్పతాగి, స్వయంగా అటవీశాఖ సిబ్బంది మీద దాడులకు దిగడమేనా సనాతన ధర్మం. ఈ ఏడాది మే 18న శ్రీకాకుళం జిల్లా గార మండలం కళింగపట్నం అద్దేపల్లిపేటలో కోదండరామాలయంలో ఘోర అపచారానికి పాల్పడ్డారు. కల్కి, బలరాముడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడి విగ్రహాలను ధ్వంసం చేసి పక్కన పడేశారు. నిందితులను ఇంతవరకు పట్టుకోలేదు, దాని మీద ఎలాంచి చర్యలు లేవు.ఈ ఏడాది నవంబరు 11న కాశీబుగ్గలో కార్తీక ఏకాదశి నాడు భక్తులు భారీగా వస్తారని తెలిసినా.. కనీస పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేయలేదు. వేలాదిమంది భక్తులు దర్శనానికి రావడంతో తొక్కిసలాట జరిగి 9 మంది చనిపోయారు. గుడికి వెళ్తే తిరిగిప్రాణాలతో వస్తామో? రామో? అన్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. అలాగనే పక్కనే ఉన్న శ్రీకూర్మంలో సరైన నిర్వహణ లేకపోవడం వల్ల... నక్షిత్ర తాబేళ్లు చనిపోతే కనీసం పోస్టుమార్టమ్ కూడా నిర్వహించకుండా ఈవో కార్యాలయం వెనుక వాటిని తగలబెట్టారు. ఇవన్నీ మీ పరిపాలనకు మచ్చుతునకలు. రామతీర్థంలో శ్రీరాముడి తల నరికిన వ్యక్తికి ప్రభుత్వ నిధుల నుంచి రూ.5 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇచ్చారా? లేదా? ఈ రకమైన కార్యక్రమాలు చేస్తుంది. 2024-25 లో హిందూ ధర్మాన్ని కూటమి ప్రభుత్వం ఎంతటి దుస్థితికి దిగజార్చిందనడానికి ఇవన్నీ ఉదాహరణలు మాత్రమే. తిరుపతిలో తొక్కిసలాటలో గతేడాది 6గురు చనిపోయారు. దానికి కారణమైన అధికారులను మరలా అదే స్థానంలో నియమించారు. రెండు రోజుల క్రితం 24, 25 తేదీల్లో మరలా తొక్కిసలాట జరిగింది. మీకు అనుకూలంగా పని చేసే అధికారులు తప్పు చేసినా వారి మీద చర్యలు ఉండవన్నది స్పష్టమవుతోంది.సదావర్తి భూములను వేద పండితుల పోషణ కోసం ఇచ్చారు. అని అన్యాక్రాంతం కాకుండా వైయస్సార్సీపీ ప్రభుత్వం కాపాడింది. ఇవాళ కూటమి ప్రభుత్వంలో భక్తుల కానుకలు వేసిన హుండీలకు కూడా భద్రత లేదు. అహోబిలంలో రూ.20 లక్షలు భక్తులు వేసిన కానుకలని స్థానిక ఎమ్మెల్యే మనుషులు కైంకర్యం చేస్తే.. కనీసం కేసు కూడా పెట్టలేదు. దేవాలయాల్లో పెరిగిన రాజకీయ జోక్యానికి ఇదే నిదర్శనం. ఆలయాల్లో చొరబడి రాజకీయజోక్యంతో నాశనం చేస్తున్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని చిన్నతిరుపతిగా పేరు గాంచింది. 19-11-2025న హుండీ లెక్కింపుల్లో వాసంశెట్టి శ్రీనివాసరావు... మంత్రి వాసంశెట్టి సుభాష్ సిఫారసుతో వచ్చి.. డబ్బులు దొంగతనం చేస్తే కేసు పైలు చేశారు. దీని మీద కూటమి నేతలు నోరు మెదపరు. ఇవన్నీ ఈ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అరాచకాలు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలయాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు లేవు. వారి భద్రతకు చర్యలు తీసుకోకుండా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయధర్మాదాయ శాఖ అధికారులు




భక్తుల ప్రాణాలను గాల్లో వదిలేసింది. రాష్ట్రంలో వివిధ ఆలయాల నిర్వహణ కోసం, వేదపండితులు పోషణ కోసం దేవాలయాలకు భూములిస్తారు. అయితే ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఒక జీవో ప్రకారం ఆలయాల భూములను తమకు తూచినట్లు, టెండర్లు లేకుండానే తమకు నచ్చిన వారికి కట్టబెట్టే విధంగా జీవో జారీ చేసింది. ఇది ఏ మేరకు ధర్మం? వైఎస్ జగన్ హయాంలో ఒక ఆర్డినెన్స్ తీసుకొచ్చి దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూశారు. కానీ ఈ ప్రభుత్వం వాటిని దోచిపెట్టే పని చేస్తోంది.రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవస్థానం అయిన.. విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో.. 70 వేల మంది భక్తులున్న ఆలయంలో 3 నుంచి 4 గంటల పాటు కరెంటు సరఫరా నిలిపివేస్తారంటే ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో అర్థం అవుతుంది. ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా? దేవాదాయ, ధర్మాదాయ మరియు విద్యుత్ శాఖలకు మధ్య ఉన్న సమన్వయలోపానికి ఇదే నిదర్శనం. ప్రభుత్వ అసమర్థ పాలనకు తార్కాణం. అనంతపురం సింగనమలలో పుట్ పాత్ మీద సిరి రమణ అనే ఒక అర్చకుడు ఆందోళనకు దిగాడు. 150 ఏళ్లుగా వంశపారపర్యంగా ఆలయ అర్చకత్వం చేస్తుంటే.. వారిని గుడి నుంచి గెంటేస్తే.. పోలీసులకు ఫిర్యాదు చేసినా, కలెక్టర్ కు అర్జీ ఇచ్చినా పట్టించుకోకపోవడం అత్యంత అమానుషం.ద్వారకా తిరుమలలో సైతం ప్రభుత్వ అసమర్థ నిర్వహణ వల్లే గోవులు చనిపోతే.. దాని మీద ఇంతవరకు చర్యలు లేవు. కూటమి పాలన వచ్చిన తర్వాత విశాఖపట్నం వేదికగా పెద్ద మొత్తంలో గోమాంసం విదేశాలకు ఎగుమతి అవుతుంది. హిందూ సమాజానికి జరుగుతున్న అతిపెద్ద ద్రోహం ఇది. బాపట్ల ఎమ్మెల్యే సన్నిహితుడు గోడౌన్ లో పట్టుబడినా చర్యలు శూన్యం. తూతూ మంత్రంగా ఇద్దరిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. కర్నూలులో లే అవుట్ కి అడ్డంగా ఉందని ఆలయ గోడ కూల్చి వేసిన ఘటన చోటు చేసుకుంది.ఇంకా టీడీపీ ఎమ్మెల్యే ఒకరు బహిరంగంగా భగవద్గీతను అవమానించారు. ఎన్టీఆర్ జిల్లా నారికంపాడులో ఆలయానికి చెందిన 28 ఎకరాలను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించమని హైకోర్టు ఆదేశిస్తే, మొత్తం 1036 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం జిల్లా రిజిస్ట్రార్కు లేఖ రాసింది. అంటే కోర్టు ఆదేశాన్ని చూపి, మొత్తం భూమిపై కన్నేసి.. అలా ఆలయ ఆస్తుల రిజిస్టర్లో ఇనాం, ఎస్టేట్ భూములని చూపి, దాన్ని స్వాహా చేయడానికి కుట్ర చేశారని మల్లాది విష్ణు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పాలనలోనే

(మొదటి పేజి (తరువాయి)

ప్రజల అధికారాలను ఆర్ఎస్ఎస్ లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ ఎప్పుడూ మతం పేరుతో ఓట్లు అడగలేదని, ప్రజలను ఐక్యం చేస్తుందని.. అయితే బీజేపీ విడదీస్తోందని విమర్శించారు. 'ఎన్నికల గురించి కాదు.. దేశం కోసమే మా పోరాటం' అంటూ ఖర్గే వెల్లడించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు వివిధ రాష్ట్రాల్లో ఈ వేడుకలను జరుపుకుంటున్నాయి.

# ఒకరోజు ముందే పెన్షన్లు

(మొదటి పేజి (తరువాయి)

ఆయన క్లారిటీ ఇచ్చారు. సదరం సర్టిఫికెట్ల పరిశీలన మాత్రమే జరుగుతోందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇస్తున్నామని ఆయన తెలిపారు. దివ్యాంగుల పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదే అన్నారు.పింఛన్ల కోసం జగన్ ప్రభుత్వం 5 ఏళ్ళలో రూ.84 వేల కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం18 నెలల్లోనే రూ. 50 వేల కోట్ల ఖర్చు చేసిందని మంత్రి గుర్తుచేశారు. దివ్యాంగులకు సీఎం చంద్రబాబు నాయుడు 7 వరాలు ప్రకటించడంతో వారంతా చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్నారని తెలిపారు. అది చూసి ఓర్వలేకనే జగన్ అండ్ కో దివ్యాంగుల పింఛన్లపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. పింఛన్ల పెంపుపై మాట తప్పి దివ్యాంగులను సైతం మోసం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అన్నారు. వైసీపీ హయాంలో అర్హులను పక్కనపెట్టి అనర్హులకు ఫేక్ సర్టిఫికెట్లతో పింఛన్లు ఇచ్చి ప్రభుత్వ సొమ్ము దిగ మింగారని మంత్రి విమర్శించారు. తప్పుడు రాతలు, అసత్య ప్రచారాలతో పత్రిక విలువల్ని కాలరాస్తున్న వైసీపీ బ్లూ మీడియాని ప్రజలు చీత్కరిస్తున్నారని తెలిపారు.

# కీలక నిర్ణయం

మహిళలు అప్పర్ బెర్త్ ల పైకి ఎక్కలేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం మహిళలకు, వృద్ధులకు చాలా సంతోషం కలిగిస్తుంది.సాధారణంగా రైళ్లలో మహిళలు, వృద్ధులకు లోయర్ బెర్త్ లను కేటాయిస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో అప్పర్ బెర్త్ లను కూడా కేటాయించటం వలన వారు ఇబ్బంది పడుతున్నారు. ఇంతకుముందు ప్రయాణికులు బుకింగ్ సమయంలో లోయర్ బెర్త్ కావాలంటే ఎంచుకోవలసి వచ్చేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం బుకింగ్ సమయంలో ఎంపిక చేసుకోక పోయినప్పటికీ కూడా 45సంవత్సరాలు పైబడిన మహిళలకు, వృద్ధులకు భారతీయ రైల్వే ఆటోమేటిక్ గా లోయర్ వ్యక్తులను కేటాయించనుంది.ఈ మేరకు బుకింగ్ విధానంలో కీలక మార్పులను రైల్వే చేపట్టింది. అంతేకాదు దివ్యాంగులకు వారి సహాయకులకు కొన్ని బెర్త్ లను ప్రత్యేకంగా రిజర్వ్ చేస్తున్నట్టు పేర్కొంది. ఇదే విషయాన్ని రాజ్యసభలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. స్లీపర్ కోచ్ లలో దివ్యాంగులు, మహిళలు, పెద్దలకు ఆరు నుండి ఏడు లోయర్ బెర్త్ లు, 3ఏసీలో 4నుండి 5, సెకండ్ ఏసీలో మూడు నుండి నాలుగు బెర్త్ లు కేటాయించనున్నారు.ఈ సౌకర్యం గర్భిణీ స్త్రీలకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఈ మార్పులను చేస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. రాజధాని, శతాబ్ది ఎక్స్ప్రెస్ రైళ్ల తో పాటు అన్ని రైళ్ల లోను ఈ మేరకు లోయర్ బెర్త్ ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు.

# శాశ్వతంగా స్వస్తి

(మొదటి పేజి (తరువాయి)

తీసుకున్న ఈ నిర్ణయంతో ఫ్యాన్స్ తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయారు. విజయ్ కథానాయకుడిగా నటించిన జననాయగన్ సినిమా ఆడియో విడుదల వేడుక మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగింది. రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్‌కి ఈ సినిమా చివరి చిత్రం కావడంతో అభిమానులు ఈ వేడుకకు పెద్దఎత్తున హాజరయ్యారు. ఇది మలేషియా రికార్డ్ బుక్‌లో కూడా చోటు చేసుకుంది.ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తాను ఇసుకతో చిన్న ఇల్లు కట్టుకుందామని సినిమాల్లోకి వచ్చానని తెలిపారు. అయితే అభిమానులు తనకు రాజమహల్ ఇచ్చారని తెలిపారు. తన కోసం ఎంతోమంది థియేటర్లకు వెళ్లి సినిమాలు చూశారని.. ఇంతకాలం సపోర్ట్ చేసిన అందరి కోసం మరో 30 ఏళ్ల పాటు తాను నిలబడతానని చెప్పారు. ప్రజలకు సేవ చేయడం కోసమే సినిమాలకు స్వస్తి పలుకుతున్నట్లు తెలిపారు. ఇకపై పూర్తిగా ప్రజా సేవకే తన సమయం కేటాయించనున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా విజయ్.. తన ఫ్యాన్స్‌కు థ్యాంక్స్ చెప్పుతూ ఎమోషనల్ అయ్యారు. విజయ్ ప్రసంగానికి అభిమానుల కళ్లు కూడా చెమర్చాయి. దళపతి విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని ఇప్పుడిప్పుడే స్పీడ్ పెంచుతున్నారు. 2024 ఫిబ్రవరి 2న తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించిన విజయ్.. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# అరకువ్యాలీలో పర్యాటకుల రద్దీ

(మొదటి పేజి (తరువాయి)

పర్యాటకుల రద్దీ పెరగడం, ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో అరకు వెళ్లే మార్గంలో ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించిపోతున్నాయి. నిత్యం.. సుమారు అర కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో అరకు ఘాట్ రోడ్డును ఒకవైపు మూసివేశారు అధికారులు. ప్రయాణికులు, టూరిస్టుల రద్దీ అధికంగా ఉండటంతో అరకు నుంచి విశాఖ వెళ్లే వాహనాలపై నిషేధం విధించి.. కేవలం విశాఖ నుంచి అరకు వెళ్లే వాహనాలనే అనుమతిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా.. అరకు నుంచి విశాఖ వెళ్లేప్రయాణికులు పాడేరు మీదుగా వెళ్లాలని పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాహనదారులు, టూరిస్టులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.ఇక.. పద్మాపురం గార్డెన్, ట్రావెల్ మ్యూజియం, చాపురాయి ప్రాంతాలు పర్యాటకులతో కిక్కిరిసిపోతున్నాయి. సందర్శకులు పెద్దఎత్తున తరలిరావడంతో రూములు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉడెన్ బ్రిడ్జి సందర్శన వేళల్లో మార్పులు చేశారు అధికారులు.

# టిడిపి వాళ్ల పోస్టర్‌లపై రక్త తర్పణాలు కనిపించలేదా

తాడేపల్లి, డిసెంబర్ 28 :



పొట్టేళ్ల రక్తతర్పణాల వ్యవహారంలో వైసీపీ క్యాడర్ ను ప్రభుత్వం టార్గెట్ చేయడంపై ఆ పార్టీ మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్ అయ్యారు. గతంలో చంద్రబాబు, బాలకృష్ణ పుట్టినరోజులు, గెలుపుల నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలు చేసిన రక్త తర్పణాల వీడియోల్ని ఆయన బయటపెట్టారు. గత వైసీపీ హయాంలోనే జరిగిన ఇలాంటి చర్యలపై కూటమిలో భాగస్వామి అయిన పవన్ కళ్యాణ్ అప్పుడు ఎందుకు స్పందించలేదని పేర్ని ప్రశ్నించారు. అప్పుడే పవన్ స్పందించి వాళ్లను మోకాళ్లపై నిలబెట్టి, కాలుకు కాలు కీలుకు కీలు తీసి ఉంటే ఇలాంటివి ఇప్పుడు పునరావృతం అయ్యేవి కావన్నారు.ఈ రాష్ట్రంలో మీరు రెడ్ బుక్ పేరుతో బెదిరింపులకు దిగడం వల్లే మా వాళ్లు రప్పా.. రప్పా అని అంటున్నారని పేర్ని కౌంటర్ ఇచ్చారు.గదిలో పెట్టి పిల్లిని కొడితే తిరగబడుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు పిల్లి కంటే తక్కువా ?, వాళ్లు వెధవల్లా పరిపాలించారు, మనమెందుకు చేయాలనే మేం చెప్తున్నామన్నారు రేపు మనకూ రిటైర్ అయిన అధికారులు వస్తారు, సిట్ లు వేస్తాం. తప్పులు చేయొద్దని వైసీపీ కార్యకర్తలకు పేర్ని సూచించారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్

## సిపిఐ మహాసభలను జయప్రదం చేయండి

**కనేకల్, డిసెంబర్ 28:**
సిపిఎం మహాసభల జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సభలను జయప్రదం చేయాలని చేపట్టిన జీపు జాత ఆదివారం కనేకల్ చేరుకుంది ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు ,జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ జనవరి 4న విశాఖపట్నం జరిగే బహిరంగ సభలను విజయవంతం చేసేందుకు కార్మిక వర్గానికి పిలుపునిస్తున్నామని అన్నారు. కాబట్టి ఈ మహాసభకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ సభ వేదిక మంచి అవకాశం ఇస్తుందన్నారు. కాబట్టి కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఆర్వి నాయుడు కోశాధికారి నాగమణి, అంగన్వాడీ ఆశా వర్కంర్లు, హమాలి, ఆటో వర్కర్స్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

## విద్యార్థులకు నిత్యసురభి అన్నదానం

**అనంతపురం రూరల్, డిసెంబర్ 28:**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ శ్రీమతి. డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో విద్యార్థులకు ఆదివారం అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు హరినాథ్ రెడ్డి భార్య శ్రీమతి సౌజన్య పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఉన్న దానిలో విద్యార్థులు సర్దుకుపోయే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. చదువుకు మించిన సంపద లేదన్న విషయాన్ని గ్రహించి ప్రతి ఒక్కరూ చదువులో రాణించాలన్నారు. మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని, సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు శ్రీ స్వామి సత్యాత్మానంద గారు, శ్రీ చక్రపాణి గారు, విష్ణువర్ధన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణస్వామి సేవలు మరువలేనివి

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 28:**
గాజుల నారాయణస్వామి కళాకారులకు చేసిన సేవలు మరువలేమని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని లలిత కళాపరిషత్ నందు మాది కార్యదర్శి గాజుల నారాయణస్వామి వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్యదర్శి పద్మజ సీనియర్ కళాకారుడు సంఘాల నారాయణస్వామి, మాట్లాడుతూ కళాకారులకు ప్రతి ఒక్కటి సహాయం చేస్తూ వారి ఉన్నతి కోసం మాసవారి నాటక ప్రదర్శనలు ప్రారంభించడం జరిగిందన్నారు. నంది నాటకోత్సవం లో పాల్గొనడం శ్రీకారం చేసిన వ్యక్తి అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామ్ గోవింద్ సాగర్, రామిరెడ్డి శీన సుబ్బన్న అస్లాం భాష, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణస్వామికి నివాళులు అర్పిస్తున్న కళాకారులు.

## బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

### ఉప్పలపాటి శ్రీనివాస రాజు..

**తాడిపత్రి, డిసెంబర్ 28:**
తాడిపత్రి జూనియర్ సివిల్ కోర్టులోని బార్ కౌన్సిల్ హాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అభ్యర్థి ఉప్పలపాటి శ్రీనివాస రాజు, భారతీయ జనతా పార్టీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ పివి ప్రతాప్ రెడ్డితో కలిసి న్యాయవాదులను తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉప్పలపాటి శ్రీనివాస రాజు మాట్లాడుత యువ న్యాయవాదులకు స్టైపెండ్ పెంపు, ఆరోగ్య బీమా, పెన్షన్ సౌకర్యాల సంక్షేమ పథకాల మెరుగుదల గురించి హామీ ఇచ్చారు. కోర్టు ఆవరణలలో న్యాయవాదులకు మెరుగైన లైబ్రరీలు, ఇంటర్నెట్ సదుపాయం బార్ రూమ్ మౌళిక సదుపాయాల కల్పన చేస్తానని తెలిపారు. న్యాయవాదులపై దాడులు జరగకుండా అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు కోసం గట్టిగా పోరాటం చేసి రక్షణ చట్టం తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. బార్ కౌన్సిల్ నిధులను సద్వినియోగం చేస్తూ, నిర్ణయాల్లో పారదర్శకత పాటిస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాదులతో వ్యక్తిగతంగా సమావేశమై వారి సమస్యలను విని వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ జంగంరెడ్డి అంకాల రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షైక్ బాజి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నర్సింగరావు, గంగాధర్ యాదవ్, నారాయణ స్వామి, శేషానంద్ రెడ్డి, రంగనాయకులు, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న శ్రీనివాస రాజు

# హెచ్ఎల్సీ కాలువలో జంతు కళేబరాలు, చెత్తాచెదారం

### తీవ్రమైన దుర్గంధం.. వాహనదారులు, ప్రజల ఇబ్బంది.. పట్టించుకోని హెచ్ఎల్సి అధికారులు..

**కనేకల్, డిసెంబర్ 28:**
కనేకల్ సబ్ డివిజన్ పరిధిలోని రాంనగర్ ప్రాంతంలోని హెచ్ఎల్సి ప్రధాన కాలువలో షట్టర్ల వద్ద చెత్తాచెదారం జంతు కళేబరాలు పేరుకుపోవడంతో భరించలేని దుర్గంధం వస్తోంది. దాదాపు 15 రోజులు అవుతున్నా హెచ్.ఎల్.సి అధికారులు, పంచాయతీ అధికారులు ఇవేవీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో స్థానిక ఇందిరమ్మ కాలనీ, చాపల కాలనీ, రామ్నగర్ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. హెచ్ఎల్సి ప్రధాన కాలువ ద్వారానే కనేకల్ నుండి ఆలూరు, కనేకల్ క్రాస్, మీదుగా కళ్యాణదుర్గం, రాయదుర్గం బళ్ళారి వివిధ పంట పొలాలకు ప్రజలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. అటు ఇటుగా వచ్చిపోయే ప్రజలు, ప్రయాణికులు, అధికారులు పాలకులు సైతం ఇదేమి పట్టనట్లు వ్యవహరించడం పరిపాలన నిర్లక్ష్యానికి అర్థం పడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. కనేకల్ పట్టణంలోకి చేరుకోవాలంటే ప్రధాన ద్వారం హెచ్.ఎల్.సితో ప్రారంభమవుతుంది. అయితే ఇక్కడ ద్వారం ప్రాంతంలో స్వాగతానికి బదులుగా దుర్గంధం స్వాగతం పలుకుతోంది. దీన్ని యువత ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్గా మారింది. దీంతో కనేకల్ పేరు ప్రతిష్టలు మరింత దిగజారిపోయాయి. ఈ చెత్తాచెదారం జంతు కళేబరాలు పేరుకుపోవడం వల్ల రోగాలు ప్రబలే వీలుందని దీనివల్ల ప్రజలు రోగాల బారినపడు ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఇంత జరుగుతున్నా హెచ్.ఎల్.సి, పంచాయతీ అధికారులు, పోలీసులు ఏమాత్రం పట్టించుకోకపోవడలో దుర్గంధంతో నరకయాతన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.
ఈ ప్రాంతంలో హెచ్.ఎల్.సి ఆయకట్టు అధిక మొత్తంలో ఉన్నప్పటికీ హెచ్ ఎల్ సి అధికారులు స్థానికంగా లేకపోవడమే దీనికి నిదర్శనం అన్నారు. హెచ్ఎల్సి అధికారులు ఇక్కడ నివాసం ఉండక విధులకు అప్పుడప్పుడు వస్తూపోతుంటారు. జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ ఇక్కడ హెచ్.ఎల్.సిని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ఉన్నతాధికారులు డి ఈ, జేఈ లు ఇద్దరు సైతం ఇక్కడ నివాసం ఉండకపోవడంతో హెచ్.ఎల్.సి సమస్యలు అనేకం ఉన్నా కనీసం స్పందించడం లేదని రైతుల సైతం ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఒకరోజు కూడా అధికారులు కార్యాలయంలో ఉండడం మేము గమనించలేదని ఫోన్ ద్వారా అధికారులకు ఏదైనా సమాచారం విన్నవించుకుంటే ఈరోజు డ్యూటీలోనే ఉన్నామని ఫీల్డ్ వర్క్ లో ఉన్నామని చెబుతున్నారు తప్ప కార్యాలయం కి వచ్చి రైతుల సమస్యలు ప్రజల సమస్యలు, హెచ్.ఎల్.సి సమస్యలు పట్టించుకున్న పాపాన పోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. హెచ్ ఎల్ సి అధికారులు విచ్చలవిడిగా కార్యాలయానికి హాజరు కాకపోవడం వల్ల కాలువలకు సంబంధించిన సమాచారం అందించిన స్పందించడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి, పాలకులకు అధికారుల వల్ల చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. పై స్థాయి అధికారులు రాకపోవడంతో కిందిస్థాయి అధికారులు సైతం యధా రాజా ప్రభ ప్రజా అనే చందంగా కార్యాలయాలకు హాజరుకాకుండా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకుండా ఎవరి దారిన వారు కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు మాత్రం సక్రమమైన టైం కి తీసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా ఉంటూ కార్యాలయానికి సక్రమంగా హాజరవుతూ సంఘటన స్థలాన్ని గుర్తించి వీటిని తొలగించి స్వచ్ఛమైన హెచ్.ఎల్.సి నీటిని ప్రజలకు రైతులకు అందించి స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడే విధంగా చూడాలన్నారు.



కనేకల్ హెచ్ఎల్సి కాలువ షటర్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



హెచ్ఎల్సి నీటిలో తేలుతున్న జంతుకళేబరం

# అర్ధరాత్రి పేదలకు దుప్పట్లు పంపిణీ

### ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు ..

**తాడిపత్రి, డిసెంబర్ 28:**
అసలే చలికాలం, అర్ధరాత్రి 12 గంటల నుండి ఒంటి గంట సమయంలో తీవ్రమైన చలిని సైతం లెక్కచేయకుండా సేవా గుణంతో మేము సైతం అంటూ అర్ధరాత్రి నిరు పేదలకు దుప్పట్లు కప్పుతూ ముందడుగు వేసిన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులకు తాడిపత్రి ప్రజలు సలాం అంటున్నారు. పట్టణంలో వివిధ కూడళ్లలో ఆరు బయలు ప్రాంతంలో నిద్రిస్తున్నటువంటి నిరు పేదలకు ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు అందించినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్ తెలిపారు.

**ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ..**
స్థానిక సౌభాగ్య సింధు బాల కళ్యాణ ఆశ్రమంలో విద్యార్థులకు ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ అభాగ్యులు, నిరుపేద విద్యార్థులకు సంబంధించిన కార్యక్రమాలు ఎన్నో చేశామని నేడు సౌభాగ్య సింధు బాల కళ్యాణ ఆశ్రమంలోని విద్యార్థులకు సేవ చేసే భాగ్యం తమకు లభించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. మరో రెండు రోజులపాటు ఆశ్రమంలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపడతామని తెలిపారు. బాల కళ్యాణ ఆశ్రమం వ్యవస్థాపక కమిటీ సభ్యులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దానం చేయడం మానవ ధర్మమని, సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులకు అభినందనలు తెలిపారు. బాల కళ్యాణ ఆశ్రమం ఉపాధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ఈ సేవా సంస్థ పేదల కోసం, నిరుపేద విద్యార్థులు, వివిధ వర్గాల కోసం ఎన్నోవిధాలుగా సేవలు అందిస్తూ, ఎంతోమంది మన్ననలు పొందారన్నారు. సేవా సంస్థలు ఎన్ని ఉన్నా వాటిలో ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ప్రథమ స్థానంలో దూసుకు పోతోందనడంలో ఎటువంటి సందేహం లేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ గౌరవాధ్యక్షులు గురప్ప కన్వీనర్ శ్రీహరి ఉపాధ్యక్షులు కుమారస్వామి, కరుణాకర్, శ్రీనివాసులు కార్యదర్శి లక్ష్మీనారాయణ, సౌభాగ్య సింధు ఆశ్రమ అధ్యక్షులు తంగుటూరి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.



అర్ధరాత్రి పేదలకు దుప్పట్లు కప్పుతున్న దృశ్యం





ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం. విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

# అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు తూమాటి ప్రసాద్కు ఘన సన్మానం

### మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులకు కృతజ్ఞతలు.... టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య...

**బెళుగుప్ప, డిసెంబర్ 28 :**
అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమితులైన నరసాపురం తూమాటి ప్రసాద్ను ఆదివారం జిల్లా టిడిపి నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య ఆవులెన్న సర్పంచ్ రామ్మోహన్ చౌదరి నరసాపురంలోని ప్రసాద్ నివాసంలో పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు నరసాపురం తూమాటి ప్రసాద్ ని అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమితులకు సహకరించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషిచేసి,15 సంవత్సరాలుగా బెళుగుప్ప మండలం టీడీపీ పార్టీ కన్వీనర్ గా పనిచేసిన ప్రసాద్ చేసిన సేవలకు గుర్తింపుగా పయ్యావుల సోదరుల సహకారంతో అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా ప్రసాద్ ను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. బెళుగుప్ప మండలం మరింత అభివృద్ధికి సహకారం అవుతుందన్నారు.



నరసాపురం తూమాటి ప్రసాద్ను సన్మానిస్తునన టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున,పెద్ద తిప్పయ్య,ఆవులెన్న సర్పంచ్ రామ్మోహన్ చౌదరి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

## 31నే పెన్షన్ల పంపిణీ

**కనేకల్, డిసెంబర్ 29 :**
జనవరి 1న న్యూ ఇయర్ సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉండటంతో, పెన్షన్లను డిసెంబర్ 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు మండల టిడిపి కన్వీనర్ వన్నా రెడ్డి, ఉప్పర సగర సంగం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆనందరాజులు, టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు లాలెప్ప తెలిపారు. కూటమి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు ముందుగానే గుర్తించి ఒకటో తేదీకి ఒకరోజు ముందుగానే రాష్ట్రానికి ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది చంద్రబాబు అధ్యక్షతన నడుస్తున్న కూటమి ప్రభుత్వమేనన్నారు.ఈ మేరకు అన్ని గ్రామ మరియు వార్డు సచివాలయాల సిబ్బంది డిసెంబర్ 31న లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఏవైనా కారణాల వల్ల మిగిలిపోయిన పెన్షన్లను జనవరి 2వ తేదీన పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

## మహా పూర్ణాహుతితో సౌమనస్క యాగం సమాప్తం

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 28:**
నగరంలోని రెండవ రోడ్డు శర్మ కాంపౌండ్లో శ్రీ జ్ఞానపీఠం లోక కళ్యాణ్ అర్థం సనాతన ధర్మాన్ని పరిరక్షించడం కోసం మూడు రోజుల యాగాలను పరి సమాప్తం చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తాల కు ప్రసాద వితరణ చేశారు.

## మా కొడుకు ప్రాణాలు కాపాడారు.. మిమ్మల్ని ఎప్పటికీ మరువలేం

### ఎమ్మెల్యే దగ్గుపాటి వద్ద క్యాన్సర్ బాధిత బాలుని తండ్రీ ఉద్వేగం

**అనంతపురం రూరల్, డిసెంబర్ 28:**
నా కొడుకు ప్రాణాలు కాపాడారు..మిమ్మల్ని ఎప్పటికీ మరువలేనంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వద్ద ఓ తండ్రి ఉద్వేగానికి గురయ్యారు. అనంతపురం నగరంలోని వేణుగోపాల్ నగర్కు చెందిన కిరణ్ కుమార్ కుమారుడు 12 ఏళ్ల చిన్నికృష్ణ ఉదయ్ పవన్ కుమార్ బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డాడు. బెంగుళూరులోని శ్రీ శంకర క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా బాలుడికి చికిత్స అందిస్తున్న క్రమంలో ఆపరేషన్ కోసం భారీ స్థాయిలో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. పేద కుటుంబం కావడంతో బాలుని తల్లిదండ్రులు ఎమ్మెల్యే దగ్గుపాటి వద్దకు వచ్చి తమ ఆవేదన చెప్పుకున్నారు. దీంతో ఎమ్మెల్యే మంత్రి నారా లోకేష్ సహకారంతో బాలుని ఆపరేషన్ కోసం 12 లక్షల రూపాయలు ఎల్ఓసి ద్వారా అందజేశారు. బాలుడికి ఇటీవల బెంగళూరులో ఆపరేషన్ విజయవంతమైంది. బాలుడు సురక్షితంగా ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో ఆ చిన్నారి తండ్రి కిరణ్ కుమార్ ఇవాళ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ను టిడిపి కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. మీరే స్పందించక పోయి ఉంటే నా పరిస్థితి ఏమి అయి ఉండేదోనని దగ్గుపాటి వద్ద ఉద్వేగానికి గురయ్యారు. మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. బాలుడి ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల దగ్గుపాటి కూడా సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే బాలుని నేను కలుస్తానని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్న తనని కలవాలని సూచించారు.

## శబరిమలలో ఘనంగా మండల పూజ

### వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. తిరిగి 30న తెరుచుకోనున్న ఆలయం...

**త్రివేండ్రం, డిసెంబర్ 28:**
అయ్యప్పస్వామి కొలువైన శబరిమలలో శనివారం మండలపూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మణికంఠుడు దర్శనం చేసుకున్నారు. ఆలయ తంత్రి కందరారు మహేశ్ మోహనారు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహిం చారు. రాత్రి పదిగంటల సమయంలో స్వామికి పవళింపు కీర్తన హరివరాసనం ఆలపించిన అనంతరం ఆలయ ద్వారాలను లాంఛనంగా మూసివేశారు. దీంతో వార్షిక యాత్ర సీజన్లో 41 రోజుల పాటు సాగిన తొలిదశ ముగిసినట్లైంది. మకరవిలక్కు పూజల కోసం ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప ఆలయ ద్వారాలను తెరుస్తారు. ఆ రోజు నుంచి వార్షిక యాత్ర సీజన్లో రెండో దశ మొదలవుతుంది.





ట్రైనీలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

# ప్రకృతి వ్యవసాయం సాగు విధానంలో మెళకువలు పాటించండి

**బత్తలపల్లి, డిసెంబర్ 28:**
ప్రకృతి వ్యవసాయం సాగు చేసే సమయంలో రైతులకు మెలకువలు నేర్పాలని పోగ్రాం మేనేజర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. బత్తలపల్లిలోని రైతులు ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన పంట పొలాలలోకి కొత్తగా ఎంపికైన శిక్షణ ఐసీఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన ఏటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, పీఎండిఎస్ మోడల్ పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ముందుగా సాగు విధానం తెలుసుకోవాలన్నారు. అయితే ఎలాంటి రసాయనక మందులు వాడకుండా కేవలం సహజంగా దొరికే ఆవు పేడ, ఆవు మూత్రం ద్వారా జీవామృతం. ఘనజీవామృతం తదితర ద్రావణం తయారు చేసుకుని పంటలకు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటి హరికుమార్, డీటీటీ రవీంద్ర, ఎల్ వన్ నరసింహులు, డివిజన్ ఇన్చార్జ్ సాకే గంగమ్మ, ఎల్ టూ పార్వతి, ఎల్ త్రి అమృతరాణి, అశ్విణి, లీలావతి, రాధ, ఎన్ఎఫ్ఐ కీర్తన, దినేష్, వెంకటేష్, రామాంజి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పురం పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు రత్నమ్మ నరసింహమూర్తికి ఘన సన్మానం

**అమరాపురం, డిసెంబర్ 28:**
హిందూపురం పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలుగా అమరాపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి భార్య మాజీ సర్పంచ్ ,మాజీ ఎంపీపీ, రత్తమ్మ నరసింహమూర్తిని నియమించడం పట్ల వి. అగ్రహారం పంచాయతీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రత్నమ్మ నరసింహమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. వి. అగ్రహారం గ్రామపంచాయతీకి చెందిన పంచాయితీ క్లస్టర్ కో కన్వీనర్ నవీన్ కుమార్, సర్పంచ్ ధనుంజయ మాజీ సర్పంచ్ క్రిష్టప్ప, వైస్ సర్పంచ్ ఈరన్న,, గొల్ల కృష్ణప్ప, తాలూకా ఎస్సీ సెల్ కార్యదర్శి ధనుంజయ, రామలింగప్ప, దొడ్డన్న, వసంత రాజు, నాగరాజు, రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హిందూపురం పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు రత్నమ్మ నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం ఎనలేని కృషి చేశామని అందువల్ల తమపై నమ్మకం ఉంచి అధిష్టానం గుర్తించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నేడు ఆమడగూరులో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పర్యటన

**పుట్టపర్తి, డిసెంబర్ 28:**
పుట్టపర్తి నియోజకవర్గం ఆమడగూరు మండల కేంద్రంలో ఉదయం 10:30 గంటలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి చేతులమీదుగా చౌడేశ్వరి కళ్యాణ మండపంలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు టిడిపి యువనేత శ్యాంబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా 200 మంది పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కొత్తచెరువు మండలం తలమర్ల పంచాయతీలో ప్రధాన బస్టాప్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణ పనులకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గారు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులతో కలసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అదేవిధంగా అదే పంచాయతీలో రోడ్డు పనుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు.

# ీ పొరుగు సేవల్లో 20 మంది ట్రాన్స్‌జెండర్లు

**విశాఖపట్నం, డిసెంబర్ 28:**
జ్యోతిర్గమయ మిషన్ కింద జీవీఎంసీ పొరుగు సేవల్లో 20 మంది ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించారు. 20 మంది ట్రాన్స్ జెండర్లను సిటీ పారిశుధ్య కార్మికులుగా చేర్చుకున్నారు. వీరికి నగర మేయర్ శ్రీనివాస్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి నియామక పత్రాలు అందించారు.





రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న స్త్రీ వ్యాధి నిపుణులు డాక్టర్ జ్యోతి విజయ్ కుమార్, సామాన్య వ్యాధి నిపుణులు ఓంకార్ నాయక్

# ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

## 160 మందికి ఉచిత పరీక్షలు, మందులు పంపిణీ..

**అమరాపురం, డిసెంబర్ 28:**
అమరాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగులు నుంచి అనూష స్పందన లభించింది .ఈ సందర్భంగా కర్ణాటక చిత్రదుర్గ నుంచి వచ్చిన స్త్రీ వ్యాధి నిపుణులు జ్యోతి విజయ్ కుమార్, రోగులను పరీక్షించారు. వారికి సలహాలు, సూచనలు అందించారు. ముఖ్యంగా ఐరన్ లోపంతో బాధపడుతుండడం గమనించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కర్ణాటక. పావగడ నుంచి వచ్చిన సామాన్య వ్యాధి నిపుణులు ఓంకార నాయక్ రోగులను పరీక్షించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. రోగులకు వైద్య ఆరోగ్యమైతి కూటమి, యూనిటీ హెల్త్ కాంప్లెక్స్ చిత్రదుర్గ వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు. సమారు 160 మందికి వైద్య సేవలు అందించారు.



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం. వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలు

# అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికయాదవ్‌కు ఘన సన్మానం

## టిడిపి అగళి మండల ప్రధాన కార్యదర్శి డి విశ్వనాథ్ యాదవ్..

**అగళి, డిసెంబర్ 28 :**
అంధ మహిళల టి -20 కికెట్ వరల్డ్ కప్‌లో భారత జట్టుకు సారథ్యం వహించి అద్భుత విజయాన్ని అందించిన అమరాపురం మండల పరిధిలోని తంబాలహట్టి గ్రామానికి చెందిన కుమారి టి.దీపిక యాదవ్‌ను టిడిపి అగళి మండల ప్రధాన కార్యదర్శి డి.విశ్వనాథ్ యాదవ్ మధుడి , ఇరిగేపల్లి గొల్లహట్టి యువకులు ఆదివారం బెంగళూరులోని అకాడమీలో కలిసి అభినందనలు తెలిపారు. దీపికతో పాటు ఆమె స్నేహితులకు మణి హారాలతో ఘనంగా సన్మానించారు.



దీపిక, సహచర క్రీడాకారిణులను సన్మానించిన విశ్వనాథ్ యాదవ్, తదితరులు



దీపికతో విశ్వనాథ్ యాదవ్

# అఖిల భారతీయ యాదవ మహాసభకు భారీగా తరలివెళ్లిన యాదవులు

**అగళి, డిసెంబర్ 28 :**
శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సత్యసాయి జిల్లా మొట్టమొదటి అఖిల భారతీయ యాదవ మహాసభకు మడకశిర ఏపీఎంసీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచప్పయాదవ్, అగళి మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ ల ఆధ్వర్యంలో మండలం నుంచి యాదవులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని ఇరిగేపల్లి గొల్లటి,మధూడి గొల్లట్టి, నందరాజనపల్లి గొల్లట్టి, కెంకర గొల్లట్టి,హల్లికెర గొల్లట్టి, ఉల్లేకెర గొల్లట్టి, ముక్కడంపల్లి గొల్లట్టి, జంగమరపల్లి గొల్లట్టి, దొక్కలపల్లి గొల్లహట్టి, హనుమనపల్లి గొల్లట్టి, పూలపల్లి గొల్లట్టి, బొమ్మసానిపల్లి గొల్లట్టి, తదితర గ్రామాల గొల్లట్టి నుంచి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో దాదాపు 200 మందికి పైగా ఆదివారం పుట్టపర్తి కేంద్రంలో సాయిరాం ఫంక్షన్ హాల్లో జరిగిన మొట్టమొదటి అఖిల భారతీయ యాదవ మహాసభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ సంఘం నాయకులతోపాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచప్పయాదవ్ ను పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తో పాటు రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు లాక వెంగళరావు



అగళి మండల కేంద్రం నుంచి తరలివెళ్తున్న యాదవులు

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ జాతీయ యాదవ సంఘం నాయకులు అన్నా రామచంద్ర యాదవ్ జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ రాధాకృష్ణ సత్యసాయి జిల్లా యాదవ సంఘం నాయకులు హాజరైనారని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన యాదవులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి యాదవ్. పాల్గొన్న యాదవులు



మసీదు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

# మసీదు నిర్మాణానికి భూమి పూజ

**అమరాపురం, డిసెంబర్ 28:**
అమరాపురం ఇందిరమ్మ కాలనీలో మసీదు నిర్మాణానికి ముతువల్లీలు,, మత పెద్దలు భూమి పూజ చేశారు ఇందిరమ్మ కాలనీలో కొత్తగా గౌసియా మజీద్ నిర్మాణం చేపట్టనున్నట్లు ముస్లిం సోదరులు తెలిపారు. భూమి పూజ కార్యక్రమానికి ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి,మడకశిర బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ ,మండల కన్వీనర్ దేవగనపల్లి కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ దాదా పీర్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న మడకశిర బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్

# మృతదేహం సొంతూరుకు తరలించేందుకు సాయం..

## మానవత్వం చాటుకున్న రమేష్ నాయక్

**నల్లమాడ, డిసెంబర్ 28:**
బతుకు తెరువుకు కేరళ రాష్ట్రానికి వెళ్లి మృత్యుఒడి చేరిన ఓ పేద వ్యక్తి మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకువచ్చేందుకు ఆర్థిక సాయం చేసి వైసిపి ఎస్‌టి విభాగం, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుంగావత్ రమేష్ నాయక్ మానవత్వాన్ని చాటుకున్నారు. నల్లమాడ మండలం కుటాలపల్లి తండా గ్రామానికి చెందిన రాము నాయక్ కొన్ని మాసాల క్రితం బతుకుతెరువు కోసం కేరళ రాష్ట్రానికి వెళ్లారు. అక్కడే అకస్మాత్తుగా మృతి చెందిన రాము నాయక్ మృతదేహం స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు కూడా అవస్థలు పడుతున్న వారి కుటుంబ పరిస్థితిని గమనించి రమేష్ నాయక్ రూ 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతో కేరళలో ఉన్న రాము నాయక్ మృతదేహాన్ని స్వగ్రామమైన కుటాలపల్లి తండాకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం కేరళకు వెళ్లి అక్కడే రాము నాయక్ మృతి చెందడం తనను కలచివేసిందన్నారు. వారి కుటుంబ పరిస్థితి తనకు తెలియగానే తన వ్యక్తిగత కార్యదర్శి నారాయణస్వామి నాయక్ చేత వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశామన్నారు. బ్రతుకుతెరువు కోసం స్థానిక గ్రామాల్లో పనులు లేక ఇతర రాష్ట్రాలకు పేదలు వలసలు వెళ్లడం ఇంకా తగ్గకపోవడం శోచనీయమన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలు, తండాలకు చెందిన అనేకమంది బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, కేరళ ప్రాంతాలకు కుటుంబ పోషణ కోసం వలసలు వెళ్లడం దారుణం అన్నారు. ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించి పేదలను ఆదుకోవాలని ఆయన తెలిపారు.



ఆర్థిక సాయం చేస్తున్న రమేష్ నాయక్ వ్యక్తిగత కార్యదర్శి నారాయణస్వామి నాయక్



పెద్దమ్మతల్లి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

# బత్తలపల్లిలో వైభవోపేతంగా బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు

**బత్తలపల్లి, డిసెంబర్ 28:**
బత్తలపల్లి వడ్డెర కాలనీలో వెలసిన పెద్దమ్మ ఆలయంలో గత మూడు రోజులుగా కాలనీవాసులచే నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టా వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా వేదపండితులు మంజునాథశర్మ ఆధ్వర్యంలో గణేష్కర్మ, శ్రీవస్తశర్మ,ఇతేష్కర్మ, వంశీకర్మలచే వైభవంగా పూజా కార్యక్రమాలను,హెూమాలను నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో బొడ్రాయిలను కాలనీ చుట్టూ ఐదు ప్రాంతాలలో ప్రతిష్టించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆనంతరం విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమం ఆదివారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. ఆదివారం ఉదయం కాలనీలోని మహిళలు పెద్దమ్మ ఆలయానికి ప్రతి ఇంటి నుంచి నైవేద్యంగా తీపి అన్నంను చేసుకొని ప్రత్యేక కుండలో బోనాలు తీసుకువచ్చి, ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి నారికేళాలను సమర్పించారు. తదుపరి అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న కాలనీవాసులు



ఉత్తర ద్వారం

# రేపు వైకుంఠ ఏకాదశి వేడుకలు

## ముస్తాబైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం..

**రొళ్ల, డిసెంబర్ 28 :**
మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో కొత్త తిరుపతిగా వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 30 న మంగళవారం నిర్వహించే వైకుంఠ ఏకాదశికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోవిందరాజు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిఏటా పుష్యమి మాసంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితిగా వస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 3 గంటల నుంచి సుప్రభాత సేవలు నిత్య హెూమము పంచామృత అభిషేకము ఆరాధన అలంకార నైవేద్యం మహా మంగళహారతి నీరాజనం చేపట్టనున్నారు. ఉదయం 6 గంటలకు ఉత్తర ద్వారా పూజ శ్రీవారి ప్రకారోత్సవం అనంతరం ఉత్తర ద్వారా దర్శనాన్ని భక్తులకు అవకాశం కల్పిస్తారు. ముక్కోటి ఏకాదశి నాడు వైకుంఠ ద్వార దర్శనం చేస్తే కోటి పుణ్యఫలం లభిస్తుందని ప్రజల నమ్మకం. సూర్యమానం చంద్రమానం రెండు కలయికతో చేసే పండుగే ముక్కోటి ఏకాదశి భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముక్కోటి దేవతలు విష మూర్తిని దర్శించుకున్న రోజు కనుకనే ముక్కోటి ఏకాదశిగా పేరుగాంచిందని నానుడి.



ఆలయ వ్యవస్థాపకులు గోవిందరాజు



శ్రీవేంకటేశ్వర స్వామి మూలవిరాట్



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్

## మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

**మంత్రాలయం, డిసెంబర్ 28 :**
ఎమ్మిగనూరు పట్టణ న్యూ ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి గుండెపోటుతో మరణించిన ఎం హమాలి రాజు కుటుంబానికి ఎమ్మెల్యే బి.వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. కర్నూలు టిడిపి ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ మట్టి ఖర్చులకు 10000 రూపాయలు అందజేశారు. రాజు కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ స్టోర్ చైర్మన్ గట్టు అల్తాఫ్ , కోపరేటివ్ టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరికోట షాలేము , టిడిపి యువత కళ్యాణ్, ఎస్ విల్సన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



హమాలి రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్

## తాగునీటి వసతి పారంభం

**సంగం , డిసెంబర్ 28:**
సంగంలోని శివాలయంలో కిమ్స్ ఫౌండేషన్ ద్వారా భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కిమ్స్ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలుపుతూ వారి సేవను ప్రశంసించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున రానున్న రోజులను ద ృష్టిలో ఉంచుకొని త్రాగునీటి వసంత కల్పించడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు.

## శ్రీరామనగర్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**పెద్దకడబూరు, డిసెంబర్ 28 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని శ్రీరామ నగర్, ఎస్సీ కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్త పైపులైన్ వేసినట్లు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం గ్రామంలో జరుగుతున్న కొత్త పైపులైన్, కొలాయి ఏర్పాటు పనులను సర్పంచ్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అన్ని కాలనీలకు మంచినీటి వసతి కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తామన్నారు. ఇందులో భాగంగానే శ్రీ కృష్ణ ఆశ్రమం వద్ద ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా శ్రీరామ నగర్ కు కొత్త పైపులైన్ చేశామన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో ఐదు, శ్రీరామ నగర్ పది కొలాయిలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనయే లక్ష్యంగా గ్రామ పంచాయతీ పని చేస్తుందని తెలిపారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.


కొలాయిల ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్


పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్

## చిన్నతుంబళం గ్రామ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టండి

**పెద్దకడబూరు, డిసెంబర్ 28 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ ప్రధాన ముఖద్వారం (బస్టాండ్) నుండి బాపురం శ్రీ గంగా భవాని దేవాలయం వరకు ప్రధాన రహదారి అత్యంత దయనీయంగా ఉందని గ్రామస్తులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. మాధవరం రహదారిలోని చిన్నతుంబళం గ్రామ ముఖద్వారం నుంచి గ్రామం వరకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. గత కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు రాయల చెరువు కడగమ్ము ఎక్కి రహదారిపై ప్రవహించడంతో రహదారిలో గుంతలు పడ్డాయని, వీటిని పట్టించుకొనే నాథుడే కరువయ్యారని తెలిపారు. ఈ కారణంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఈ రహదారి ద్వారా


రహదారులోని గుంతలను చూపిస్తున్న గ్రామస్తులు


గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి

ప్రయాణించే వ ృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు మరియు గర్భిణీ స్త్రీలు తీవ్రమైన శారీరక కష్టాలకు లోనవుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లేందుకు కూడా ఈ రహదారి అడ్డంకిగా మారడం తీవ్ర ఆందోళనను కలిగిస్తోందని వాపోయారు. తక్షణమే ఆర్అండ్ బీ అధికారులు స్పందించి చిన్నతుంబళం ముఖద్వారం నుంచి గ్రామం వరకు రహదారికి మరమ్మతులు చేపట్టాలని వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప, నాయకులు సోమప్ప గౌడ్, లింగన్న గౌడ్, మదిరె రాముడు, హరిజన బొడ్డన్న, ముస్లిం వలి బాషా, చెవుల లక్ష్మన్న, కందనాతి మహాదేవ, వడ్డే బీముడు, కమ్మరి బ్రహ్మయ్య, బోయ కడబూరి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు మహబూబ్ బాషా, శరణప్ప, బోయ నాగేష్, కమ్మరి వీరేష్, బోయ అంజిని తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల పిపిపి విధానాన్ని విరమించుకోవాలి

**సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ ..**

**అనంతపురం రూరల్, డిసెంబర్ 28 :**
పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పిపిపి) పేరుతో రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలనిబీ పిపిపి విధానానికి స్వస్తి పలికి నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నూతన వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పిపిపి) విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యుత్సాహం చూపిస్తూ, మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏపీలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు అందరూ ముక్తకంఠంతో రాష్ట్ర ప్రభుత్వ పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. మాజీ యూనియన్ హెల్త్ సెక్రటరీ సుజాత రావు హిందూ పత్రికలో రాసిన ఆర్టికల్ లో "మెడికల్ కాలేజీలో పిపిపి విధానం వల్ల రోగులు ఇబ్బందులు పడటమే కాకుండా సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు నష్టపోతారని" చాలా స్పష్టంగా వివరించారన్నారు. నూతన మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం భూములు, భవనాల నిర్మాణం, వనరులు, మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పించిందన్నారు.. ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటుకు అప్పగించడంతోపాటు, రెండేళ్ల పాటు సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవటం దుర్మార్గం అన్నారు. విద్యార్థులు నుండి ఫీజులు వసూలు చేసుకునేందుకు మాత్రం ప్రైవేటుకు అవకాశం కల్పించడం విచారకరం అన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పిపిపి విధానం ప్రభుత్వ ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచి పెట్టడమే. టెండర్లు వేసేందుకు కూడా ఎవరూ రాని పరిస్థితుల్లో, అష్ట ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ మాత్రం టెండర్లు వేసేందుకు ముందుకు వస్తున్నారని అవాస్తవాలు చెబుతున్నారన్నారన్నారు

౨ హైదరాబాదులో ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పేద మధ్యతరగతి వర్గాలు ఉన్నత స్థితికి రావాలంటే విద్యని ఆయుధంగా చేసుకోవాలని సూచించారని, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వందలాది మందికి విద్యను అందించటం అభినందనీయమే కానీ ప్రభుత్వ రంగంలోని వాటిని ప్రైవేటుకు అప్పగించి, ట్రస్టు ద్వారా మాత్రం కొందరికి చదువులు చెప్పించి మిగిలిన వారిని గాలికి వదిలేయటం సబబేనా అన్నారు. రాష్ట్రంలోని విద్యా వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పగిస్తే పేద సామాన్య మధ్య తరగతి వర్గాలకు అవి అందుబాటులో ఎలా ఉంటాయి అని ప్రశ్నిస్తున్నామన్నారు ఇప్పటికే ఏపీలో ప్రాథమిక, ఉన్నత విద్య, ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు ప్రైవేటు శక్తుల చేతుల్లో కొనసాగుతున్నాయని, ఇప్పుడు మెడికల్ కాలేజీలు కూడా అప్పగించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పిపిపి విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి పిపిపి విధానాన్ని విరమించుకోవాలి. వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేస్తున్నామరన్నారు

## కౌతాళంలో ఘనంగా హిందూ సమ్మేళనం

**కౌతాళం, డిసెంబర్ 28:**
కౌతాళం మండలం కేంద్రంలోని కృష్ణామృత ఆశ్రమంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రౌడుకుంది పీఠాధిపతులు హారిక మంజునాథ్ , హర్లబండ పీఠాధిపతులు కృష్ణావధూత హాజరయ్యారు. వీరికి కౌతాళం గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కౌతాళం గ్రామస్తులు వైయస్ విగ్రహం నుండి కృష్ణావధూత ఆశ్రమం వరకు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదన కార్యక్రమం నిర్వహించారు.


పీఠాధిపతులను ఊరేగిస్తున్న దృశ్యం


హిందూ సమ్మేళంలో జ్యోతి వెలిగిస్తున్న హారిక మంజునాథ్, మాట్లాడుతున్న హారిక మంజునాథ్, రాఘవేంద్ర స్వామి దేవస్థానం శ్రీ అప్పన్న ఆచారి. పాల్గొన్న జనం

## హిందూ ధర్మాన్ని నలుమూలల చాటండి

### ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ రాజు

**రామకుప్పం, డిసెంబర్ 28:**
హిందూ ధర్మాన్ని నలుమూలల చాటాలని ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన రాజు అన్నారు. రామకుప్పంలో హిందూ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన రాజు ముఖ్య వక్తగా పాల్గొని ఉపన్యాసం ఇచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యులు ఎక్కువగా సేవా కార్యక్రమాలు దేశభక్తి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. అన్ని వర్గాలను సమానంగా గౌరవించాలని అందరికీ సమన్యాయం అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యక్రమాలు విస్త ృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశ భద్రత ద ృష్ట్యా దేశానికి అవసరమైన కీలకమైన అంశాలలో కూడా ఆర్ఎస్ఎస్ తన వంతు సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. భగవద్గీత రామాయణం ఇతర కావ్యాల్లోని వాటి సారాంశం ఏ విధంగా జరిగిందనే దానిపై క్లుప్తంగా వివరించారు. మానవ మనుగడలు కీలకమైనది వాటి గురించి మనిషి అన్నవారు ఏ విధంగా జీవించాలి ఉదాహరణలతో తెలియజేశారు. సమాజంలో ప్రస్తుతం ఉన్న అసమానతలు గురించి తెలియజేశారు. అందరూ ఐక్యతలో ఉండాలని సూచించారు. దేశ భద్రత విషయంలో ఎవరు కూడా రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. మన


కార్యక్రమానికి తరలివచ్చిన హిందువులు



హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన రాజు

మతాన్ని గౌరవిస్తూనే ఇతర మతాల వారిని కూడా గౌరవించాలని కించపరచరాదని సూచించారు. అందరూ కలిసికట్టుగా హిందూ సామ్రాజ్యంలో ఉన్నామని ప్రపంచ స్థాయిలో గురుస్థానం పొందేందుకు క ృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని తెలియజేశారు. దేశంలో పదివేల పాఠశాలలను ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తుందని తెలిపారు. దేవాలయాలలో దైవభక్తి ఇతర అంశాల గురించి చక్కగా ఆయన విశ్లేషంగా వివరించారు. హిందూ సమ్మేళన వాహిని కార్యకర్తలు వైయస్సార్ సర్కిల్ నుంచి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీతాపతి, వీకోట పురోహితులు, భాస్కర్ శర్మ ప్రసంగించారు. దేవాలయంలో జరిగే పూజలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో కూడా ప్రజలు హిందువులు పాల్గొనాలని సనాత ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, జనసేన పార్టీ అధ్యక్షుడు హరీష్ ,మాజీ ఎంపీపీ జయప్ప, హిందూ సమ్మేళన వాహిని కార్యకర్తలు రాని జనార్ధన్ రెడ్డి, ఆంజనేయప్ప, బి నాగరాజు, సతీష్, రాజప్ప, మంజునాథ్, బియ్యం కుమార్, దయానిధి, రమేష్, లోకనాథ్ రెడ్డి కమల్నాథ్ రెడ్డి అమర్నాథ్ రెడ్డి, సుకుమార్ రెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు రామచంద్ర, చిత్తూరు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, కుటుంబ బోధి ప్రభాకర్ రాజు ఇంకా పలువురు యువకులు మహిళలు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## పోలీసులు, ఏపీఎస్పీ బెటాలియన్ మధ్య స్నేహపూర్వక క్రికెట్ టోర్నీ

**ఆదోని, డిసెంబర్ 28:**
జిల్లా పోలీసులు, ఏపీఎస్పీ పోలీసుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ పోటీ నిర్వహించారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని, పోలీసుల విధి నిర్వహణ ఒత్తిడిని ఎదుర్కోనేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పటేల్ తెలిపారు. ఆదివారం కర్నూలు ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ మైదానంలో సివిల్, ఎఆర్, ఎపిఎస్పీ పోలీసు జట్ల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పటేల్ ప్రారంభించారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ క్రికెట్ ఆడి సిబ్బందిని ఉత్సాహపరిచారు. జిల్లా సివిల్, ఎఆర్ పోలీసుల జట్టుకు కెప్టెన్‌గా జిల్లా ఎస్పీ వ్యవహరించారు. ఎపిఎస్పీ పోలీసుల జట్టుకు కెప్టెన్‌గా ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పటేల్‌వ్యవహరించారు. ఇరు జట్ల మధ్య జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ విన్నర్‌గా ఎపిఎస్పీ 2వ బెటాలియన్ పోలీసులు, రన్నర్‌గా కర్నూలు జిల్లా పోలీసులు నిలిచారు.
ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా పోలీసులకు, కర్నూలు ఎపిఎస్పీ పోలీసులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం విధుల్లో ఉండే సిబ్బందికి క్రీడలు ఫిట్ నెస్‌తో ఉండడానికి, మానసిక నూతనోత్సహాన్ని ఇస్తాయన్నారు.


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్,

క్రీడలతో శారీరక ధృఢత్వానికి, ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. గెలుపు , ఓటములు సహజమన్నారు. కర్నూలు ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ శ్రీమతి దీపికా పాటిల్ మాట్లాడుతూ మొత్తం సంవత్సరం అంతా బందోబస్తు విధులలో ఉండే పోలీసుల ఒత్తిడిని తగ్గించడానికి, ఫిజికల్ ఫిట్ నెస్ ఉంటూ ప్రజలకు మేరుగైన సేవలందించే ఉద్దేశ్యంతో పోలీసులు బాగా పని చేయాలని ఈ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించామన్నారు.
ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్ లు ఎస్ . ఎం. భాషా, సుధాకర్ రెడ్డి, వెంకటరమణ, సిఐలు , ఆర్ ఐలు, ఎస్సైలు, సివిల్, ఎఆర్, ఎపిఎస్పీ , ఎస్డీఆర్ ఎఫ్ పోలీసులు ఉన్నారు.


టాస్ ఎగరవేస్తున్న దృశ్యం . క్రికెట్ ఆడుతున్న జిల్లా కలెక్టర్ . బహుమతి అందుకుంటున్న దృశ్యం



## గ్రామాలను చెత్తరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### ఎంపీడీవో సుబ్బారెడ్డి

**దువ్వూరు, డిసెంబర్ 28 :**
ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా, చెత్తరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' మరియు 'స్పెషల్ గ్రామసభలు' నిర్వహిస్తున్నట్లు దువ్వూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సుబ్బారెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకుంటూ పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డ్రైవ్‌కు సంబంధించిన కాలపట్టికను మరియు లక్ష్యాలను వెల్లడించారు. డిసెంబర్ 26 నుండి జనవరి 4 వరకు గ్రామాల్లోని చెత్త కుప్పలను, పాత వ్యర్థాలను తొలగిస్తారన్నారు. పారిశుధ్య కార్మికుల రక్షణ కోసం డిసెంబర్ 24 లోపే కిట్లను పంపిణీ పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో చెత్త ఎక్కువగా వేసే ప్రాంతాలను గుర్తించి, జనవరి 4 లోపు అక్కడ మొక్కలు నాటి సుందరీకరణ చేపట్టాలన్నారు. 'చెత్త నుండి సంపద తయారీ' కేంద్రాల్లో అవసరమైన తొట్లు సిద్ధం చేయడం, ఇతర సౌకర్యాలను జనవరి 4 లోపు పూర్తి చేయాలన్నారు. జనవరి 5వ తేదీన ప్రత్యేక గ్రామసభ నిర్వహించి, గ్రామాలను 'చెత్త రహిత గ్రామాలు'గా ప్రకటిస్తారన్నారు. తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో పనులు సజావుగా సాగేలా మండల పరిషత్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీవో ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## 30న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

### ఆలయ ధర్మకర్త నాగం సుబ్బారెడ్డి..

**అట్లూరు, డిసెంబర్ 28:**
వైకుంఠ ఏకాదశి సందర్భంగా అట్లూరు మండలం బద్వేల్- కడప ప్రధాన రహదారి కుంభగిరి గ్రామం మెయిన్ రోడ్డు ఆర్చి వద్ద వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో 30వ తేదీ వేకువ జామున భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నాగం సుబ్బారెడ్డి, అర్చక స్వామి భీష్మాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా గంధం, పసుపు,కుంకుమ, భస్మం, తులసీదళ సుగంధ ద్రవ్య ఉదకాలు, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు వైభవోపేతంగా నిర్వహింస్తామన్నారు. అనంతరం స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి కరుణామృతానికి పాత్రులు కాగలరని అన్నారు. అభిషేకంలో పాల్గొనదల్చిన భక్తులు రూ. 2,516 చెల్లించి తమ గోత్ర నామాలు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆలయ ధర్మలో సంప్రదించాలన్నారు.



## పెళ్లి ముగిసేలోపే కాపురానికి ముగింపు..!

*24 గంటల్లోనే విడాకులకు కోర్టు మెట్లెక్కిన జంట*

**పూణే, డిసెంబర్ 28:**
పూణేలో ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కేవలం 24 గంటలకే ఓ నూతన దంపతులు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. పెళ్లైన వెంటనే కాపురం ఎలా ఉండాలి, భవిష్యత్ జీవన విధానం ఏంటి అనే అంశాలపై తీవ్ర విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య ముందే చర్చించుకోని విషయాలు పెళ్లి తర్వాత బయటపడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరస్పర అవగాహన కుదరకపోవడంతో కలిసి జీవించడం సాధ్యం కాదని నిర్ణయించుకున్న జంట, పరస్పర అంగీకారంతో విడాకుల పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. పెళ్లికి ముందు సరైన అవగాహన, ఆలోచనల సరితూగుదల ఎంత ముఖ్యమో మరోసారి ఈ సంఘటన స్పష్టం చేస్తోందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

# హిందూ ధర్మం కోసం ప్రతి ఒక్కరూ ధర్మ పోరాటం చేయాలి

### శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీ అచలానంద ..

**బద్వేల్, డిసెంబర్ 28:**
హిందూ ధర్మం కోసం ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ లాగా, వివేకానందుడిలాగా ధర్మ పోరాటం చేయాలని తోట్లపల్లి ఆశ్రమం నిర్వాహకులు శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీ అచలానంద పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తియైన సందర్భంగా బద్వేలులోని నెల్లూరు రోడ్డులోని శ్రీ రాఘవేంద్ర గ్రాండ్ కల్యాణ మండపంలో హిందూ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ హిందూ సమ్మేళనానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు తోట్లపల్లి ఆశ్రమం నిర్వాహకులు శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీ అచలానంద , ప్రధాన వక్తగా ఆర్ఎస్ఎస్ జిల్లా బౌద్ధిక్ రామిడి జైపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా ప్రముఖ కాంట్రాక్టర్, ఏపీఐఐసీ డైరెక్టర్ మహిళా వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి, వక్తగా జిల్లా సేవికా సమితి శ్రీమతి వెలిగల ధనలక్ష్మి , అధ్యక్షులుగా పెరుగు వెంకటయ్య, విశిష్ట అతిథిగా బిజెపి జిల్లా కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి గౌరవాధ్యక్షులు చెన్నమరాజు రామకోటి రాజు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో విరజానంద స్వామి మాట్లాడుతూ హిందువులందరూ పులులైనప్పటికీ మేకల్లాగా కలిసిపోయి తిరిగుతూ బతుకుతున్నారన్నారు. ప్రస్తుత కాలంలో హిందువులందరూ చైతన్యమై మన ధర్మాన్ని, మతాన్ని ఆలయాల నిర్వహణను ఆలయ భూములను అన్యాకాంతం కాకుండా చూడాలన్నారు. మన దేశం పూర్వ వైభవ స్థితికి, అఖండ దేశంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పాటుపడాలన్నారు. ఇందులో మహిళా మాతృమూర్తులు దేశభక్తులను తయారు చేసే సంకల్పం తీసుకోవాలన్నారు. అందరితో కలసి ఆర్ఎస్ఎస్ కోసం సంఘం కోసం తమ పిల్లలను శిక్షణ కోసం పంపిస్తామని ప్రమాణం చేపించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న హిందూబంధువులు



మాట్లాడుతున్న శ్రీశ్రీశ్రీ విరజానంద స్వామీజీ అచలానంద

ఎంతోమంది తన జీవితం కాలం సేవ చేసేందుకు ముందుకు వచ్చారని, సేవాభావంతో దేశ కార్యం కోసం మనసా, వాచా, కర్మణా పనిచేస్తూ దేశ సేవలో తరిస్తున్నారని తెలియజేశారు. బద్వేల్ లోని ప్రతి కుటుంబం నుంచి ఒకరు ఆర్ఎస్ఎస్ శిక్షణ కొరకు పంపించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సరస్వతి శిశు మందిరం మాజీ అధ్యక్షులు కొండపల్లి సుభాష్ కుమార్, ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు సాకి ఈశ్వరయ్య, అక్కి సంజీవరెడ్డి, అక్కి రాజశేఖర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ బద్వేల్ ప్రఖండ శ్రీ సరస్వతి శిశు మందిరం బద్వేల్ ప్రధాన కార్యదర్శి పెద్ది సుధాకర్, బోరెడ్డి రఘునాథ రెడ్డి, అంబవరం వేణుగోపాల్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ కడప జిల్లా సహకార్యదర్శి పత్తిపాటి నరసింహులు, పోకూరు తిరుపాలయ్య, బిజెపి కడప జిల్లా ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి, బద్వేల్ బిజెపి పరిశీలకులు ఉట్టి శ్రీనివాసులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ బీజేవైఎం జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్ రెడ్డి, బద్వేల్ బిజెపి పట్టణ అధ్యక్షులు దర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ముఖం శ్రీనివాస్ రాయల్, బిజెపి సీనియర్ నాయకులు కుప్పాల నరసింహులు, వనం నరసింహులు, ఓంకార క్షేత్ర నిర్వాహకులు శంబు ప్రసాద్, గంగసాని సాంబశివ రెడ్డి, పల్లంశెట్టి శ్రీనివాసులు, తులసి వెంకట శివ నారాయణ, భూమిరెడ్డి వెంకటేష్, ఎర్రం రెడ్డి, అమరా జనార్దన్ రావు, బయనబోయిన శివ, ఇరగబోయిన చంద్ర, సంద్ర సునీల్, కుంభగిరి రవిశంకర్, నూనె శ్రీరాములు, సింగసాని కిరణ్ కుమార్, అనాల నరసింహ ప్రసాద్, మేడం రాజేష్, చెన్నమ్మరాజు ఈశ్వర్ పృధ్విరాజ్ , వందలాది హిందూ బంధువులు విశ్వహిందూ పరిషత్ ఆర్ఎస్ఎస్ బజరంగ దళ్, హిందూ సంఘాల కార్యకర్తలు మాతృమూర్తులు పాల్గొన్నారు.

### గడప లోపలే కులం..

# గడప దాటితే మనమంతా హిందూవులం

### మాతాజీ విద్యా చైతన్యానంద

**దువ్వూరు, డిసెంబర్ 28:**
"కులం అనేది గడప లోపల మాత్రమే ఉండాలని, గడప దాటి బయటకు వస్తే మనమంతా హిందువులమనే భావనతో ఉండాలి" అని బ్రహ్మంగారిమఠం శ్రీ అచలానంద ఆశ్రమం మాతాజీ శ్రీ శ్రీ విద్యా చైతన్యానంద పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో రామాలయం వద్ద నిర్వహించిన 'హిందూ సమ్మేళన' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.
జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్, ప్రధాన వక్త ఉల్లి బాల రంగయ్య మాట్లాడుతూ దేశ రక్షణ కోసం, ధర్మ రక్షణ కోసం హిందువులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కులమతాలకు అతీతంగా హిందూ సోదరులందరూ ఒకే తాటిపైకి రావాలని కోరారు.
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ యస్ యస్ ) స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా, గుడిపాడు సెంటర్ నుండి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న సింగన పల్లె, గుడిపాడు గ్రామాలకు చెందిన కోలాట బృందాలు చేసిన ప్రదర్శనలు భక్తులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సమ్మేళనానికి చుట్టుపక్కల గ్రామాల నుండి హిందూ సోదరులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రామాలయ ప్రాంగణం భక్తి గీతాలు, జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగింది. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువకులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



గుడిపాడు గ్రామంలో హిందూ సమ్మేళనం నిర్వహించిన దృశ్యం

### వాల్మీకి బోయల గిరిజన రిజర్వేషన్ బిల్లును

# పార్లమెంట్‌లో ఆమోదించేందకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

**చంద్రబాబూ మా గోడు పట్టించుకోండి..**
**పార్లమెంట్‌లో ఎస్టీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టించండి**
**అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించినా కొలిక్కి రాని రిజర్వేషన్..**
**ఏడాదిన్నరగా పట్టించుకోని కూటమిపై ప్రత్యక్ష పోరాటం**
**వీఆర్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల ..**

**మదనపల్లె, డిసెంబర్ 28:**
సుదీర్ఘ కాలం పోరాటాల ఫలితం అసెంబ్లీలో ఆమోదించిన వాల్మీకి బోయల గిరిజన రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించి ఆమోదింప చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబును కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ సందర్భంగా వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీలో మాజీమంత్రి కాలువ శ్రీనివాసులు, నంద్యాల పార్లమెంట్ ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్‌లో చర్చించినా.. కొలిక్కి రాకపోవడం దారుణం. 2017 డిసెంబరు 2న అసెంబ్లీలో వాల్మీకిబోయలను గిరిజనులుగా గుర్తించాలని బిల్లును ఆమోదించడం అభినందనీయమన్నారు. ఆ బిల్లును పార్లమెంట్‌కు పంపినా నేటికీ పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. ప్రస్తుతం టీడీపీ బీజేపీ జనసేన కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నడుస్తోందన్నారు. వాల్మీకిబోయల సుదీర్ఘ పోరాట ఫలితంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు స్పందించి రాష్ట్రంలో 29లక్షల జనాభా కలిగిన వాల్మీకిబోయల హక్కు, ప్రధానమైన డిమాండ్ ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నామన్నారు.
వాల్మీకిబోయలకు అన్యాయం చేస్తే వైసీపీకి పట్టిన గతే అని హెచ్చరించారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళుతామని, కూటమి స్పందించి పోతే వాల్మీకిబోయల ఉద్యమాలకు ఊపిరిపోస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 2017 డిసెంబరులో జరిగిన అసెంబ్లీలో తీర్మానం చేసిన బిల్లు సిఫారుసులు, కేంద్రానికి పంపిన మూడునెలలకే వెనుకకు రావడంపై అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ప్రస్తుతం టీడీపీ బీజేపీ జనసేన కలసి కూటమి ప్రభుత్వం నడుస్తోందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలసి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి గిరిజన రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఆవిర్భావం నుంచీ గత అయిదేళ్ళ పాలన పూర్తవుతున్న తరుణంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేవలం రాయలసీమ జిల్లాల వాల్మీకి బోయలను మాత్రమే గిరిజనులుగా గుర్తించాలని అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి సిఫారుసు చేయడం జరిగింది. కేంద్రంలోని బీజేపీకి అటు టీడీపీ, ఇటు వైసీపీ మద్దతు కొనసాగుతున్నప్పటికీ.. వాల్మీకిబోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లుపై.. కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో.. వాల్మీకిబోయలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ బీజేపీ జనసేన కూటమి, మరో వైపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని బీజేపీతో పొత్తు కొనసాగుతూ.. వాల్మీకిబోయలకు ఇచ్చిన హామీపై అన్యాయం చేయవద్దని కోరుతున్నాము. పునరావృతం అయితే... మరోసారి వాల్మీకిబోయల ఐక్యతతో నిర్వహించు ఐక్య పోరాటాలు, అసెంబ్లీ ముట్టడి, ఎమ్మెల్యేలు, మంత్రుల నివాసాల ముట్టడికి పిలుపునిస్తామని వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు ఘాటుగా ఇటు కూటమి ప్రభుత్వానికి, అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి హెచ్చరికలు చేసారు. ఈ కార్యక్రమంలో పొదల నరసింహులు, బొగ్గిటి కృష్ణమూర్తి, వాల్మీకిపురం విష్ణు, దొమ్మనబావి ఉలసల మంజునాథ, నరసింహులు, రెడ్డిశేఖర్, శ్రీనాథ్, రవి కుమార్, భానుప్రకాష్, జయచంద్ర, ప్రవీణ్, పురుషోత్తం, సందీప్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిబోయల సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు



వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డి సి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా ..

## వివాహ మహోత్సవంలో పాల్గొన్న నేతలు

### ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డి సి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా ..

**బద్వేల్, డిసెంబర్ 28:**
బద్వేల్ మున్సిపాలిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ, దుద్దుకూరు చంద్రకళ దంపతుల్ల కనిష్ఠ పుత్రిక ఇరువురి రామయ్య మనమరాలు సోని, వెంకట సాయి చందన్ తేజ వివాహ రిసెప్షన్ వేడుకలు కన్నుల పండుగగా ఆదివారం బద్వేల్ పట్టణం బయనపల్లి బొజ్జి రెడ్డి కళ్యాణ మండపంలో జరిగాయి. రాజకీయ నాయకులతోపాటు స్నేహితులు బంధువులు శ్రేయోభిలాషులు ఈ శుభకార్యంలో పాల్గొన్నారు. కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి , ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, సమృద్ధిగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



మాట్లాడుతున్న ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డి సి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా

## ఘనంగా ఫణీందర్ నాయుడు జన్మదిన వేడుకలు

**నెల్లూరు (ఇందుకూరుపేట), డిసెంబర్ 28:**
శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వైఎస్ఆర్సిపి మండల అధికార ప్రతినిధి దండిగుంట ఫణిందర్ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు ఈ కార్యక్రమానికి హాజరై ఫణిందర్ నాయుడు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి బీసీ సెల్ అధ్యక్షుడు సంతోష్ గౌడ్ మరియు అభిమానులు పాల్గొన్నారు.



యువత అభిమానుల నడుమ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న వైఎస్ఆర్సిపి మండల అధికార ప్రతినిధి దండిగుంట ఫణిందర్



రెవెన్యూ శాఖ మంత్రిని కలిసిన ఏపీ వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం

## నేటి క్యాబినెట్‌లో వీఆర్ఏల సమస్యలు చర్చించాలి

### పరిష్కరించుకుంటే సమ్మె తప్పదు .. ఏపీ వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్లిపోగు నాగేశం..

**బద్వేల్, డిసెంబర్ 28:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) లు యొక్క దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈరోజు జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మంత్రివర్గం చర్చించి తగు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 సంవత్సరాలు గా ? 1 రూపాయి కూడా జీతంలో పెంపుదల లేక అర్ధాకలతో ఇంటిల్లపాది అలమటిస్తున్నారని ప్రభుత్వం చర్చల పేరుతో రివ్యూ మీటింగ్ ల పేరుతో కాలయాపన చేయకుండా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో ఎండిపోయి నెర్రెలు భారీ చిద్రమైన వీఆర్ఏ లు కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదల శ్రేయస్సు కోరే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి యొక్క స్పందన కొరకు కోటి ఆశలతో వీఆర్ఏలు ఎదురుచూస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు . ఉద్యోగుల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కుటుంబ ప్రభుత్వం నిరుపేదలైన వీఆర్ఏలను నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మెకు పిలుపునివ్వాల్సి వస్తుందని





## మూడు నెలల్లో కె.బి.ఎన్. కాలేజీలో స్కిల్ సెంటర్ ఏర్పాటు

*మధ్య తరగతి విద్యాదీపం కెబిఎన్ కాలేజీ*
*ఎంపీ కేశినేని శివనాథ్*

**విజయవాడ, డిసెంబర్ 28:**
దేశ విదేశాల్లో వేలాదిగా స్థిరపడిన కెబిఎన్ కాలేజీ పూర్వవిద్యార్థులందరూ కాలేజీ అభివృద్ధితో పాటు నగర అభివృద్ధికి సహకరించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. కెబిఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం (కోసా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ కి కె.బి.ఎన్ .కాలేజీ కమిటీ సభ్యులతో పాటు కెబిఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం (కోసా) సభ్యులు ఘనస్వాగతం పలికారు.
పలు రంగాల్లో స్థిరపడిన కెబిఎన్ పూర్వ విద్యార్థులైన మాజీ డి ఎస్ పి అశోక్ కుమార్ గౌడ్, సి ఛానెల్ సిఈఓ రమేష్ బాబు, నటులు సుహాస్, సైకాలజిస్ట్ డాక్టర్ ఆర్.కె. అయోధ్య, ఐఎఫ్ఎస్ అధికారి (ఛత్తీస్‌ఘడ్) జె.ఎ.సి.ఎస్.రావు, ప్రముఖ న్యాయవాది నందిపాటి శ్రీనివాసరావులతో పాటు విశ్రాంత అధ్యాపకులను ఎంపీ కేశినేని శివనాథ్ ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మరో మూడు నెలల్లో కాలేజీలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పేద , మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉత్తమ విద్యావకాశాలు కల్పించాలనే సమున్నత లక్ష్యంతో స్థాపించబడిన విద్యాసంస్థ కెబిఎన్ కాలేజీ అంటూ కొనియాడారు.

60 ఏళ్ళ వేడుక చేసుకుంటున్న కెబిఎన్ కాలేజీ పూర్వవిద్యార్థులు వేలాదిగా దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. చంద్రయాన్ ప్రయోగంలో కీలకమైన విడిభాగాలు తయారుచేసిన బి.ఎన్.రెడ్డి వంటి ప్రముఖుల ద్వారా కాలేజీ కీర్తి ఖండాంతరాలు దాటి వ్యాపించిందన్నారు. తాను ఇక్కడ చదువుకోకపోయినా, కెబిఎన్ కాలేజీ తన సొంత కాలేజీ అనే భావన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కెబిఎన్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాజ రాఘవయ్య, సెక్రటరీ జె.ఎన్.శ్రీనివాస్, ఎస్ కె పి వి వి హిందూ హై స్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి మల్లయ్య, కెబిఎన్ కాలేజీ సెక్రటరీ తూనుకుంట్ల శ్రీనివాసు, వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నాగేంద్ర, ప్రెసిడెంట్ ఉసిరిక ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హై స్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు లతో పాటు కెబిఎన్ కాలేజీ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఏఐ కళ్లజోళ్లు పంపిణీ

*మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ..*

**ఆత్మకూరు, డిసెంబర్ 28:**
సృష్టికి ప్రతిసృష్టి చేసి పుట్టు గుడ్డి తోటి 80 నుండి 100% కలిగిన దృష్టిలోపం ఉన్నవారికి చూపు కనిపించేలా ఏఐ కళ్ళజోళ్ళు అందించి వారి ఉదారతను చాటుకున్నారని కిమ్స్ ఫౌండేషన్, అచల గ్రూపు ప్రతినిధులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కొనియాడారు. ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గం,చేజార్ల మండలం మాముడూరు గ్రామంలోని అబ్బూరి మహాలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీచార్జ్ సెంటర్ మరియు అచల గ్రూప్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కిమ్స్ ప్రతినిధులు అచల గ్రూపు నిధులతో కలసి జ్యోతి ప్రజ్వలన అనంతరం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ 30 వేల రూపాయల విలువైన ఏఐ కళ్ళజోళ్ళు పరికరాలను తొలివిడతగా నెల్లూరు జిల్లాలోని మాముడూరు గ్రామంలో 220 మందికి అందజేయడం గొప్ప విషయం అన్నారు. కళ్ళజోళ్ళ నిర్వహణలో కిమ్స్ ప్రతినిధులు మరియు అచల గ్రూపు ప్రతినిధులు సంయుక్తంగా కొన్ని రోజులపాటు కళ్ళజోళ్ళు నిర్వహణపై శిక్షణను ఇస్తానని ముందుకు రావడం గొప్ప విషయం అన్నారు. అంగవైకల్యం కలిగిన వారు సహజంగా వారి తల్లిదండ్రులను లేదా దేవునిపై నిందలు మోపుతుంటారని అంతేకాకుండా వేరొకరు సహాయంతో వారి పనులు చేసుకుంటూ ఉంటారని అయితే నేడు అంధత్వం కలిగిన వారికి ఎలాంటి సహాయకులు లేకుండా నేరుగా వారి పనులు చేసుకోవడానికి ఏఐ గ్లాసులు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటులో కిమ్స్ సిబ్బంది మరియు అచలా గ్రూపు సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. జనజీవన స్రవంతిలో కలవాలని ప్రతి ఒక్క అందునికి ఒక కలగా ఉంటుందని నేడు ఆ కల కళ్ళజోళ్ళు ద్వారా తీర నుందని అన్నారు. ఏఐ కళ్ళజోళ్ళ ఏర్పాటు ద్వారా చాలెంజ్ విసరడం జరిగిందన్నారు. నెల్లూరు జిల్లాలోని మాముడూరులో తొలిసారిగా ఏఐ కళ్ళజోళ్ళు అందించే కార్యక్రమాన్ని కిమ్స్ సంస్థ మరియు అచల గ్రూప్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు.
తొలుత తెలంగాణలోని హైదరాబాదులో ఆనాటి గవర్నర్ చేతుల మీదుగా 100 మందికి కళ్ళజోళ్ళు అందజేశామనిచ శ్రీకాకుళంలో ఈ సేవా కార్యక్రమం చేపట్టి నేడు నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మాముడూరు గ్రామంలో తొలిసారిగా నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏఐ బెస్ట్ స్మార్ట్ డిజైన్ గ్లాసులను అందులకు ఇవ్వాలని సంకల్పించి ముందుకు రావడం గొప్ప విషయం అన్నారు. సుమారు జిల్లావ్యాప్తంగా 2746 మంది రిజిస్టర్ అయ్యే ఉన్న అందులో ఉన్నారని ఆయన తెలిపారు. పొలిలేని కృష?య్య సుపరిచితుడని ఆయన సహకారంతో సంఘం బ్రిడ్జిని ఏర్పాటు చేయడం జరిగిందని అంతేకాకుండా వారి సలహాలు సూచనల మేరకు నెల్లూరులో వైద్యశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాపూరు నియోజకవర్గము గతంలో ఉండేదని కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గం పునర్ విభజన లో భాగంగా రాపూర్ను తొలగించడం జరిగిందన్నారు. అయినా కూడా ఆత్మకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి ఆర్థిక మంత్రిగా రావడం జరిగింది అన్నారు. అప్పుడు సంఘం బ్యారేజీ మరియు ప్రభుత్వ వైద్యశాల నెల్లూరులో ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అంచలవారీగా 150 సీట్లతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంఘం బ్యారేజ్ ఏర్పాటు ద్వారా చేజర్లకు వెళ్ళుటకు అన్న సులభతరమైందని ఆయన తెలిపారు. శ్రీకాకుళంలో వైద్య కళాశాల తో పాటు వైద్యశాల ఉన్నప్పటికీ నేడు నెల్లూరులో ఈ కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో విద్యను మరింత ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను అందజేయడం జరుగుతుందని అందులో భాగంగా నేడు ఆత్మకూరు, ఏఎస్ పేట, సంఘం మరియు చేజర్ల మండలాలకు కలిపి 266 మందికి మర్రిపాడు ,అనంతసాగరం మండలాలు కలిపి 160 మందికి స్మార్ట్ ఫోన్లు అందజేయనున్నామని ఆయన తెలిపారు. ఈ సందరరేగా అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లను అందజేశారు. కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ బొల్లినేని మాట్లాడుతూ మహాభారతంలో ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని విశ్వరూపం చూడాలని శ్రీకృష్ణుని కోరి విశ్వరూపం చూశారని తెలిపారు . అదేవిధంగా నేడు అంధులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కళ్ళజోళ్ళు అందజేయడం వారు ప్రకృతిని వీక్షించే విధంగా చేయడం గొప్ప విషయం అని తెలిపారు. ఎన్నో సేవలు కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఈరోజు చేపట్టిన కార్యక్రమం చాలా తృప్తిని ఇచ్చిందని తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు పెద్దపీట

### ఉపాధ్యాయుల పనిభారం తగ్గింపు .. ఘనంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్ 4వ జిల్లా కౌన్సిల్.. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ..

**రోళ్ల, డిసెంబర్ 28 :**
ఉపాధ్యాయుల పని భారం తగ్గించి కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు పెద్దపీట వేసిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మడకశిర ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఉపాధ్యాయులు నిర్వహించన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్ 4వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల గురించి అర్ధరాత్రి వచ్చి తలుపు తట్టిన వెంటనే వారి సమస్యలను పరిష్కరించి అండగా నిలబడతామన్నారు, గతంలో మడకశిర


మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కే భూతన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

నియోజకవర్గంలో ఉన్న ఉపాధ్యాయుల కోసం మడకశిర పట్టణంలో ఉపాధ్యాయ భవన నిర్మాణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేసిన సమయంలో జీరో వన్ జీరో హెడ్ ద్వారా ఉపాధ్యాయులకు జీతాలను ఇవ్వడం గురించి ప్రభుత్వానికి సలహాలు సూచనలు చేశామన్నారు, కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయుల పనిబరం తగ్గించి ఉపాధ్యాయులకు గౌరవం ఇవ్వడం జరుగుతుందన్నారు గతంలో జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యాయులను మందు షాపుల దగ్గర కాపలా పెట్టడం జరిగిందని , అలా కాకుండా కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులను కేవలం పాఠశాలలో బోధించడానికి మాత్రమే పరిమితం చేసే విధంగా విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ కృషి చేసారన్నారు. పాఠశాలలో రాజకీయాలకు తావు లేకుండా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యార్థులు మాత్రమే ఉండే విధంగా విధి విధానాలు కూటమి ప్రభుత్వంలో రూపొందించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకున్న సమస్యల గురించి తమ దృష్టికి తీసుకొస్తే ముఖ్యమంత్రి విద్యాశాఖ మాత్యులు లోకేష్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 4వ జిల్లా కౌన్సిల్ సమావేశం

**రోళ్ల, డిసెంబర్ 28 :**
మడకశిర పట్టణంలోని స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 4వ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్ర రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్ నాయుడు హాజరయ్యారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా దాదాపు రెండు సంవత్సరాల కాల వ్యవధి పూర్తయిన తర్వాత కూడా పాత ప్రభుత్వ ధోరణిలోనే కొనసాగుతుందని, పిఆర్సి కమిషన్ను నియమించాలని, 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్లో ఉండే బకాయిలు ఇవ్వాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక పాఠశాలలలో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్


హాజరైన యూటీఫ్ నాయకులు


మాట్లాడుతున్న రాష్ట్ర యూటీఫ్ కార్యదర్శి నాయుడు

మాట్లాడుతూ మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ ను వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు అర్బన్ ఎంఈఓ పోస్ట్ లను కేటాయించాలని, జెడ్పి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న మాట్లాడుతూ పదవ తరగతి వందరోజుల ప్రణాళికలలో సెలవులను మినహాయించాలని, ఉపాధ్యాయుల పైన యాప్ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.
ఏకగ్రీవంగా ఎన్నికైన యూటీఎఫ్ సత్యసాయి జిల్లా నూతన కమిటీ ..
రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు ఆధ్వర్యంలో యూటీఎఫ్ సత్యసాయి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా భూతన్న, అధ్యక్షులుగా డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా జిహెచ్ బాబు. సీతాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రామకృష? నాయక్ కోశాధికారిగా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులుగా జి సి నరేష్ కుమార్, నరసింహప్ప, మల్లికార్జున, రవి వర్ధన్ రెడ్డి,ఎం.బాబు, అమర్ నారాయణరెడ్డి, మురళి, చెన్నకేశవులు, శ్రీమతి నాగేంద్రమ్మ లను రాష్ట్ర కౌన్సిలర్లుగా తాహెర్ వలి, మహంతేశ్వర, మేరీ వర కుమారి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ గా సునీల్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# శ్రీ పార్శ్వనాథ స్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక పూజామహోత్సవం

**అమరాపురం, డిసెంబర్ 28:**
కర్నాటక రాష్ట్రం పావగడ నియోజకవర్గం నిడుగల్లు (ఓబలి) విడుగల్లు కొండపై వెలసిన శ్రీ పార్శ్వనాథ తీర్థంకర 1008, పద్మావతి అమ్మవారి వార్షిక పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరాపురం జైన సమాజం, నిడుగల్లు జైన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకం, 108 కళాశాల పూజ, కుంకుమార్చన పంచామృత అభిషేకం నిర్వహించారు. మహా మంగళ హారతి తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో శ్రావణబెళగల మఠాధిపతి శ్రీ చారుకీర్తి భట్టాచార్యులు, శివమొగ్గ జిల్లా ఎన్.ఆర్. పురం మఠాధి పతులు లక్ష్మీ సేన భట్టాచార్యులు పాల్గొన్నారు. వారికి జైనమతస్తులు స్వాగతం పలికారు. శ్రీ చారు కీర్తి భట్టాచార్యులు, శ్రీ లక్ష్మీసేన భట్టాచార్యులు పూజలు నిర్వహించారు. జైన మతస్తులు స్వామి వారికి పాద పూజలు చేశారు. ప్రతి సంవత్సరం వార్షిక మహోత్సవం ఘనంగా జైన కమిటీ, నిడుగల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు, తుంకూర్, పావగడ, చల్లకేర, మధుగిరి, అమరాపురం, పెనుగొండ తదితర ప్రాంతాల నుండి జైన మతస్తులు తరలివచ్చారు. అన్నదానం నిర్వహించారు.


పార్శ్వనాథ స్వామి, శ్రీ పద్మావతి దేవి అమ్మవారు


నిడుగల్లు కొండపై వెలసిన జైన దేవాలయం


శ్రావణబెళగల మఠాధిపతి శ్రీ చారుకీర్తి భట్టాచార్యులు, శివమొగ్గ జిల్లా ఎన్.ఆర్. పురం మఠాధిపతులు శ్రీ లక్ష్మీ సేన భట్టాచార్యులు

## సబ్‌మరైన్‌లో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**బెంగళూరు, డిసెంబర్ 28:**
కర్ణాటకలోని కర్వార్ నావికా స్థావరం (ఐఎన్ఎస్ కదంబ)లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం భారత నౌకాదళానికి చెందిన కల్వరి క్లాస్ సబ్‌మరైన్ ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో సముద్ర ప్రయాణం (సీ సార్టీ) చేపట్టారు. ఈ ప్రయాణంతో ఆమె సబ్‌మరైన్‌లో ప్రయాణించిన రెండో భారత రాష్ట్రపతిగా చరిత్ర సృష్టించారు. నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠీ సహకారంతో ఈ ప్రయాణం జరిగింది. రాష్ట్రపతి నావికా యూనిఫాం ధరించి, సబ్‌మరైన్‌లోకి ప్రవేశించే ముందు నావికులకు అభివాదం చేశారు. ఇంతకుముందు, మాజీ రాష్ట్రపతి ఏ.పి.జె. అబ్దుల్ కలాం 2006 ఫిబ్రవరి 13న విశాఖపట్నం నుంచి సబ్‌మరైన్ ప్రయాణం చేసి మొదటి రాష్ట్రపతిగా రికార్డు సృష్టించారు. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ ప్రాజెక్ట్-75 కింద మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించిన ఆరో సబ్‌మరైన్. ఇది స్టెల్త్ టెక్నాలజీ, అధునాతన సెన్సార్లు, ఆయుధ వ్యవస్థలతో కూడిన డీజిల్,ఎలక్ట్రిక్ అటాక్ సబ్‌మరైన్. ఈ సంవత్సరం జనవరి 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా కమిషన్ చేయబడింది. ఈ సమయంలో రాష్ట్రపతి నౌకాదళం యొక్క అండర్‌వాటర్ వార్‌ఫేర్ సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇది భారత్ యొక్క సముద్ర భద్రతపై అత్యున్నత స్థాయి నాయకత్వ విశ్వాసానికి, జాతీయ రక్షణకు బలమైన మద్దతుకు ప్రతీకగా నిలుస్తుంది. రాష్ట్రపతి భవన్ ఈ సంఘటనను "సముద్రాల లోతుల్లో భారత్ సిద్ధతకు సంకేతం"గా అభివర్ణించింది. ఈ చారిత్రక ఘట్టం నౌకాదళ సిబ్బందికి అపారమైన ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని


నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ మరణం

*జగన్ తీవ్ర విచారం*

**నెల్లూరు, డిసెంబర్ 28 :**
నెల్లూరుకు చెందిన ప్రముఖ ఇస్లాం ప్రబోధకుడు, ముస్లిం ఆధ్యాత్మికవేత్త హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ ఖాసిమీ రషాది (రహిమహుల్లాహ్) మరణంపై మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షులు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ముస్లిం ఆధ్యాత్మిక సేవా రంగానికి తీరని లోటు అని శ్రీ వైయస్ జగన్ అన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ ఆదివారం సాయంత్రం నెల్లూరులో తుది శ్వాస విడిచారు. హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ ఒక ప్రముఖ ఇస్లామియ పండితుడు. ఇంకా ఇస్లామియా న్యాయ నిపుణుడు (ఫకీహ్) కూడా. 60 ఏళ్లకు పైగా ఇస్లామియ విద్య, ఖుర్ఆన్-హదీస్ బోధనతో గడిపిన ఆయన, స్థానిక జామియా నూరుల్ హుదా మదర్సాలో సేవలందించారు. 50 ఏళ్లుగా రాష్ట్ర తబ్లిక్-ఏ-జమాత్ అధ్యక్షుడిగా ఉన్న మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్, 2008 నుంచి రాష్ట్ర జమియత్-ఉలామాకు గౌరవ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. నెల్లూరులో 50 ఏళ్ల క్రితం మదర్సా జామియా నూరుల్ హుదా అరబిక్ కాలేజీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఆయన, అప్పటి నుంచి దాని వ్యవస్థాపక అధ్యాపకుడిగా కొనసాగుతున్నారు. జీవితమంతా ఇస్లాం మత ప్రబోధకుడిగా పని చేసిన మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ సాహెబ్ నెల్లూరు జిల్లాలోనే తొలి ముఫ్తీగా గుర్తింపు పొందారని, ఆయన మరణం అక్కడ ఇస్లాం మతానికి, వేలాది విద్యార్థులకు తీరని లోటని శ్రీ వైయస్ జగన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు..



## బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు సన్మానం

**అనంతపురం రూరల్, డిసెంబర్ 28:**
నగరంలోని 40 డివిజన్ 58వ సచివాలయం పరిధిలో బదిలీపై వెళ్లిన ఉద్యోగస్తులను స్థానిక టిడిపి నాయకులు డాక్టర్ నలుబోలు మధు రాయల్ సన్మానించారు. వారికి దుస్తులు అందజేశారు . ఈ కార్యక్రమంలో డివిజన్ టిడిపి నాయకులు మహబూబ్ ఖాన్ సలీం ఇనయతుల్లా కిరణ్ కుమార్ రెడ్డి రమణ జయరాము యమహా భాష కుద్దూస్ రఫీ చికెన్ బాష మరియు పూర్వ వలంటీర్లు పాల్గొన్నారు.

## శంబాల నటులకు సన్మానం

**అనంతపురం రూరల్, డిసెంబర్ 28:**
అనంతపురం నగరంలో శంబాల మూవీ ప్రమోషన్ లో భాగంగా హీరో సాయికుమార్, హీరోయిన్ అర్చన అయ్యర్ మడకశిర శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి వారిని కలిసి సన్మానించారు.



## టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

**విశాఖపట్నం, డిసెంబర్ 28:**
విశాఖ జిల్లా దువ్వాడ మీదుగా ఎర్నాకుళం వెళ్లే టాటా-ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30గంటల సమయంలో అగ్నిప్రమాదానికి గురైంది. రైలులోని ప్యాంట్రీ కారును ఆనుకుని ఉన్న బీ1, ఎం2 ఏసీ బోగీల్లో మంటలు చెలరేగాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# కొన్ని పాత్రలకు డబ్బు తీసుకోలేదు



ఒకప్పుడు కేవలం కర్ణాటక కే పరిమితమైన కన్నడ సినిమా ఇప్పుడు 'కేజీఎఫ్', 'కాంతార' వంటి చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటుతోంది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో కన్నడ చిత్రసీమ ఒక వెలుగు వెలుగుతోంది. అయితే, తాజాగా కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఇతర భాషా చిత్రాల్లో కన్నడ నటులు కనిపిస్తున్నంతగా, ఇతర ఇండస్ట్రీల స్టార్స్ కన్నడ సినిమాల్లో కనిపించడం లేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న సుదీప్ స్టార్ల మధ్య ఉండాల్సిన పరస్పర సహకారంపై షాకింగ్ కామెంట్స్ చేశారు. 'నేను తెలుగు , హిందీ , తమిళ చిత్రాల్లో ఎన్నో సార్లు అతిథి పాత్రలు చేశాను. కొన్ని సినిమాల్లో అయితే కనీసం రెమ్యునరేషన్ కూడా తీసుకోకుండా, కేవలం స్నేహం కోసమే నటించాను. శివ రాజ్ కుమార్ కూడా ఇతర భాషా చిత్రాల్లో కీలక పాత్రలో చేస్తున్నారు.కానీ, అదే రీతిలో ఇతర ఇండస్ట్రీల నుంచి ఎవరూ మా సినిమాల్లో నటించేందుకు ముందుకు రావడం లేదు' అని సుదీప్ పేర్కొన్నారు. కేవలం సినిమాల గురించి మాత్రమే కాకుండా, తాను స్వయంగా అడిగినా ఎవరూ రాలేదని సుదీప్ చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. 'నేను పర్సనల్ గా రిక్వెస్ట్ చేసినప్పటికీ, ఇతర భాషా స్టార్స్ మా సినిమాల్లో చిన్న పాత్రలు చేయడానికి కూడా వెనుకాడుతున్నారు. ఇండస్ట్రీల మధ్య ఉండాల్సిన పరస్పర సహాయం లోపించిందని నాకు అనిపిస్తోంది' అని ఆయన అన్నారు.సుదీప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియా లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తెలుగులో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన సఈగస సినిమాతో సుదీప్ ఇక్కడ భారీ క్రేజ్ సంపాదించుకున్నారు. అలాగే ప్రభాస్ , చిరంజీవి వంటి స్టార్ల సినిమాల్లోనూ ఆయన కనిపించారు. మరి సుదీప్ చేసిన ఈ విన్నపంపై ఇతర ఇండస్ట్రీ స్టార్స్ ఎలా స్పందిస్తారో చూడాలి. కన్నడ సినిమా ఇప్పుడు గ్లోబల్ వైడ్ గా దూసుకుపోతున్న తరుణంలో, స్టార్స్ అందరూ కలిసి పనిచేస్తే ఇంకా బాగుంటుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# అదే చివరి రోజనుకున్న.. శత్రుఘ్నసిన్హా



ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ 'ఇంటర్నెట్ మూవీ డేటాబేస్' ఈ ఏడాది అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సినీతారల జాబితాను ప్రకటించింది. అందం, అభినయంతో ప్రేక్షకులను మెప్పించి, టాప్-10లో చోటు దక్కించుకున్న భామలే వీళ్లు...యువరాణిగా అలరించింది...అందాల తార రుక్మిణీ వసంత్ ఈ ఏడాది 'ఏస్', 'మదరాసి', 'కాంతార:ఛాప్టర్ 1' సినిమాలతో పలకరించింది. ముఖ్యంగా 'కాంతార'లో యువరాణి కనకవతి పాత్రకు ప్రాణం పోసి ప్రేక్షకులను కట్టిపడేసింది. సినీ ప్రముఖులు మొదలు ఫ్యాన్స్ దాకా 'రుక్మిణి ఓ అద్భుతమైన నటి' అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. రాబోయే ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ సినిమాలోనూ ఈమే కథానాయిక. యశ్ కొత్త సినిమా 'టాక్సిక్'లోనూ ఉందనే వార్తలు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి. దాంతో 'మోస్ట్ పాపులర్ స్టార్స్' లిస్ట్‌లో తొమ్మిదో స్థానంలో ఉంది.

'యానిమల్' సినిమాతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకుంది త్రిప్తి దిమ్రీ. ఒకే ఒక్క విజయంతో అన్ని భాషల్లోనూ అభిమానులను సంపాదించుకుంది. ఆమె నటించిన 'ధడక్ 2' ఓటీటీలో దుమ్మురేపింది. సెన్సేషనల్ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా రూపొందిస్తున్న 'స్పిరిట్'లో ప్రభాస్ సరసన ఆఫర్ కొట్టేసి, పాపులారిటీ జాబితాలో ఎనిమిదో స్థానం దక్కించుకుంది.

'లోక చాప్టర్ 1: చంద్ర' (తెలుగులో 'కొత్త లోక') చిత్రంతో ఈ ఏడాది థియేటర్లలో సందడి చేసింది కల్యాణి ప్రియదర్శన్. దేశంలోనే తొలి ఫీమేల్ సూపర్ హీరో సినిమా ఇదే కావడం విశేషం. చిన్న చిత్రంగా విడుదలై... అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం విడుదలైన 40 రోజుల్లో రూ. 300 కోట్లు వసూలు చేసి ఔరా అనిపించింది. కల్యాణి జాబితాలో ఏడో స్థానంలో నిలిచింది.

ఒకే ఒక్క సినిమాతో...

'సైయారా'తో ఈ ఏడాది 'టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ'గా మారింది అనీత్ పడ్డా. అల్జీమర్స్ బాధితురాలిగా తన అభినయంతో తెరపై భావోద్వేగాల్ని పండించి, యువతరం హృదయం కొల్లగొట్టిన అనీత్ లిస్ట్‌లో 'టాప్ 2'లో నిలిచింది. 'నా జీవితాన్ని మలుపు తిప్పింది 'సైయారా'. ఆ విజయం నుంచి నా జీవితంలో వచ్చిన మార్పును నేను ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నా. ప్రేక్షకుల ఆదరణే ఈ విజయాన్ని నాకు సాధ్యమయ్యేలా చేసింద'ని చెప్తూ తెగ సంబరపడిపోతోంది బ్యూటీ.

# ఆసక్తి కనబరచని సీనియర్లు

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల పోలింగ్ పూర్తయింది. ఆదివారం ఉదయం ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు వరకూ కొనసాగింది. సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. మన ప్యానల్ పేరిట చిన్న నిర్మాతలు, ప్రొగ్రెసివ్ ప్యానల్ పేరుతో పెద్ద నిర్మాతలు పోటీ పడ్డారు. అధ్యక్ష, కార్యదర్శులతోపాటు 12 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నారు.ఛాంబర్‌లో 3,355 మంది సభ్యులున్నారు. 3287 మందికి ఓటు వేసే అర్హత ఉంది. అయితే 43% అంటే, 1421 ఓట్లు పోలయ్యాయి. ప్రొడ్యూసర్స్ సెక్టార్ నుంచి 809 ఓట్లు, స్టూడియో సెక్టార్ 66, డిస్ట్రిబ్యూటర్స్ సెక్టార్ 375, ఎగ్జిబిటర్స్ సెక్టార్ 172 ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించి ఐదు గంటల తర్వాత ఫలితాలు వెల్లడిస్తారు. ఈ ఎన్నికల్లో గెలిచిన నూతన కార్యవర్గం 2027 వరకు కొనసాగనుంది.

సీరియస్‌గా తీసుకోని హీరోలు..

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలను హీరోలు లైట్ తీసుకున్నారు. నిర్మాతలుగా ఉన్న రామ్ చరణ్, కల్యాణ్ రామ్, రానా దగ్గుబాటి, రామ్ పోతినేని, మంచు విష్ణు, మోహన్ బాబు, నాగార్జున తదితరులు ఓటు హక్కు వినియోగించుకోలేదు. నాని, శ్రీవిష్ణు, సందీప్ కిషన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.